తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు | నిర్మల్ | మంచిర్యాల
ప్రాంత జయశంకర్ భూపాలపల్లి | కొమురం భీం అసిఫాబాద్
మహబూబాబాద్
గురువారం
5 నవంబర్ 2026
పేజీలు - 12




నిర్మాణ పనులను వేగవంతం చేసి
త్వరగా పూర్తి చేయాలి

□ హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 4 (జనం సాక్షి) :జిల్లావ్యాప్తంగా వివిధ దశల్లో కొనసాగుతున్న భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు.బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై పంచాయతీ రాజ్ అధికారులతో, ఎంపీడీఓ లతో కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజలకు త్వరగా అందుబాటులోకి రావాలంటే నిర్మాణాల్లో నాణ్యతతో పాటు వేగం కూడా ముఖ్యమని పేర్కొంటూ, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న కాంపొనెంట్ పనులు, వి ఓ, అంగన్వాడీ, జీపీ భవనాల నిర్మాణాలను రాబోయే 10 రోజుల్లో యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పనుల పురోగతిని పెంచాలని సూచించారు. పనుల్లో జాప్యానికి కారణాలను గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ నిర్మాణాలన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డి ఆర్ డి ఓ మేన శ్రీను,పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈఈ రాజగోపాల్ రావు, డీఈలు, ఎంపీడీవోలు, ఇతర ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లైసెన్సులు నిల్... కొనుగోళ్లు ఫుల్

- మండలంలో దళారుల అక్రమ దందా
- లైసెన్సు లేకుండానే జోరుగా పత్తి కొనుగోళ్లు
- రైతుల అమాయకత్వమే వారి పెట్టుబడి
- మార్కెట్ ఆదాయానికి గండి
- చోద్యం చూస్తున్న అధికారులు



వెంకటాపూర్ (రామప్ప), నవంబర్ 4 (జనం సాక్షి) :-వెంకటాపూర్ మండలంలో కొందరు దళారులు పత్తి కొనుగోళ్ల పేరుతో బహిరంగంగానే తమ దందాను కొనసాగిస్తున్నారు. ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి ఎలాంటి అనుమతి, లైసెన్సు తీసుకోకుండానే వ్యాపారులు, మధ్యవర్తులు గ్రామాల్లోకి నేరుగా వెళ్లి పత్తిని కొనుగోలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం పత్తి వ్యాపారం చేయాలంటే ములుగు మార్కెట్ కమిటీ నుంచి లైసెన్సు, అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. అయినప్పటికీ కొందరు మధ్యవర్తులు, దళారులు అవేవీ పట్టించుకోకుండా గ్రామాల్లోకి వెళ్లి యథేచ్ఛగా పత్తి కొనుగోళ్లు జరుపుతున్నారు. మండలంలోని ఓ గ్రామంలో ఓ అడ్డా ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఆటోలు, ట్రాక్టర్లు, తదితర వాహనాల్లో పత్తిని తరలిస్తున్నారు. మార్కెట్ యార్డుకు సంబంధం లేకుండానే నేరుగా రైతుల నుంచి సరుకు సేకరిస్తున్నారు. మార్కెట్ యార్డుకు వెళ్తే సరైన ధర పలకడంతో పాటు వెంటనే డబ్బు లభిస్తుందని తెలిసిన రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని, చేను వద్దే పత్తి కొంటామని, రవాణా ఖర్చు తగ్గుతుందని, వెంటనే డబ్బు ఇస్తామని నమ్మించి దళారులు తమ వలలో వేసుకుంటున్నారు. ఈ అక్రమ కొనుగోళ్లపై మార్కెట్ అధికారులు ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో పర్యటించాల్సి ఉండగా, కార్యాలయానికే పరిమితమవుతున్నారు. రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లో కొనుగోళ్లు జరుగుతున్నా, ఒక్కసారి కూడా అధికారులు అడ్డా వద్దకు వెళ్లి తనిఖీ చేయడం లేదు.

రైతుల అమాయకత్వమే ఆసరా

గ్రామాల్లో తిరుగుతున్న దళారులు రైతుల వద్ద సరుకు కొని, వెంటనే డబ్బు ఇస్తామనే మాట తప్ప ఎలాంటి లిఖితపూర్వక భరోసా, రశీదు, పక్కా బిల్లు ఇవ్వడం లేదు. కొనుగోలు సమయంలో తేమ పేరుతో, నాణ్యత పేరుతో ధరను తగ్గించడం, తూకంలో తేడాలు చూపడం, కాంటా వేసే సమయంలో రైతులకు అనుమానం రాకుండా మాటల్లో పెట్టి మోసం చేయడం జరుగుతోంది. కొనుగోలు చేసిన తర్వాత డబ్బును సకాలంలో ఇవ్వక, రేపు, ఎల్లుండి అని తిప్పించుకోవడం, కొంత డబ్బు ఇచ్చి మిగిలిన దానికి నెలల తరబడి తిప్పించుకోవడం, ఫోన్ చేస్తే స్పందించకపోవడం మామూలైపోయింది. పంట కోసం పెట్టిన పెట్టుబడి, అప్పులు తీర్చుకోవాల్సిన ఒత్తిడిలో ఉన్న రైతులు, డబ్బు ఆలస్యం కావడంతో మరింత అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. లైసెన్సు ఉన్న వ్యాపారి అయితే మార్కెట్ కమిటీకి బాధ్యత వహించాల్సి ఉంటుంది, రైతుకు అన్యాయం జరిగితే ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది. కానీ లైసెన్సు లేని వారి విషయంలో ఆ అవకాశమే లేకుండా పోతోంది. దీంతో మోసపోయిన రైతు ఎవరిని అడగాలో తెలియక నిస్సహాయంగా మిగిలిపోతున్నాడు. తన పంటకు సరైన ధర రాక, తన శ్రమకు ఫలితం దక్కక, రైతు కుటుంబం మిగతా 13లో..

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

- అధికారులపై సర్పంచుల ఆగ్రహం
- పలువురు అధికారుల గైర్హాజరు పై
- అరగంట పాటు ఆగిన సమావేశం
- ఎంపీడీవో జోక్యంతో కొనసాగిన సమావేశం

కెరమెరి, నవంబర్ 4 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం 45 రోజులకు ఒకసారి సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో సాయికుమార్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మండలంలోని 19 శాఖలకు సంబంధించిన అధికారులు హాజరు కావలసి ఉండగా కేవలము 10 శాఖలకు సంబంధించిన అధికారులు మాత్రమే హాజరయ్యారు. సమావేశానికి హాజరైన ప్రత్యేక అధికారి, డి ఏ ఓ వెంకట్ ను సర్పంచులు ప్రశ్నించారు. గతంలో సైతం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశాలకు పూర్తిస్థాయిలో అధికారులు హాజరు కాలేదని సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమావేశాన్ని బహిష్కరించి మూకమ్మడిగా కార్యాలయం బయటకి వచ్చేసారు. దీంతో ఎంపీడీవో సాయి కుమార్ గౌడ్ జోక్యం చేసుకొని, తాను ఎంపీడీవో పదవి బాధ్యతలు చేపట్టిన మొదటి సమావేశం కావడంతో సమావేశానికి హాజరు కావాలని, సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో సర్పంచులు తమ దృష్టికి తీసుకువచ్చి నటువంటి సమస్యలను మరోసారి నిర్వహించే సర్వసభ్య సమావేశాన్ని కల్లా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో తిరిగి సమావేశానికి యధావిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తాసిల్దార్ నాగార్జున గౌడ్, వ్యవసాయకు శాఖ మండల అధికారి యుగేందర్, ఎపివో మల్లయ్య, విద్యుత్ శాఖ రమేష్,అటవీ సెక్షన్ అధికారి శ్రీనివాస్, అసిస్టెంట్ సిడిపిఓ ఫాతిమ, ఐకెపి ఏపీఎం ముక్తేశ్వర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ వారి నివేదికలను సభ ముందు చదివి వినిపించారు.ఈ నేపథ్యంలో పలువురు సర్పంచులు గ్రామాల్లో చేపట్టినటువంటి అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో ఆయా గ్రామాల సంబంధించిన సర్పంచులు ఇబ్బందులకు గురవుతున్నట్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతోపాటు గ్రామపంచాయతీ పరిధిలో గతంలో చెప్పినట్టుగానే విద్యుత్ పరమైన సమస్యలు, విద్యుత్ తీగలను సరి చేయడం, ట్రాన్స్ఫార్ ల చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని కోరుతూ అధికారులను విన్నవించారు. ఎల్నీనో ప్రభావంతో మండలంలో పత్తి రైతులకు దిగుబడి లేక అనేక మంది రైతులు నష్టపోయే



పరిస్థితి నెలకొందని, కొన్ని గ్రామాల్లో ఎకరాకు 2 క్వింటాల్ పత్తి దిగుబడి రానటువంటి పరిస్థితి నెలకొందని, ఆయా గ్రామాలలో వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి పంట నష్ట అంచనా విలువలను రూపొందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సర్పంచులు విజ్ఞప్తి చేశారు. పలు అభివృద్ధి పనులను అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నట్లు సభ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామీణ అభివృద్ధి కోసం అటవీ అధికారులు సహకరించాలని కోరారు. అనంతరం ఎంపీడీవో సాయికుమార్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు ఖర్చుల వివరాలు అభివృద్ధిపై ప్రత్యేక వెబ్సైట్ ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ యాప్లో ఆయా గ్రామ పంచాయతీలకు మిగతా 13లో..

ఆరోగ్య ఉప కేంద్రాల పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ బ్యూరో, నవంబర్ 04 (జనంసాక్షి) : జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో సంబంధిత శాఖల అధికారులతో నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. 15వ ఆర్థిక సంఘం, ఎన్ఆర్హెచ్ఎం నిధులతో చేపట్టిన పనులను గడువులోగా పూర్తి చేయాలని, ప్రారంభం కాని పనులను వెంటనే మొదలుపెట్టాలని సూచించారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. అనంతరం డిజిటల్ గవర్నెన్స్పై సమీక్షిస్తూ, అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ఈ విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలను కాగిత రహితంగా, పారదర్శకంగా నిర్వహించేలా డిజిటల్ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.

పద్మశాలీ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాలి

సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి - విద్యా సేవలను గుర్తించాలని వినతి



పరకాల,నవంబర్ 04, (జనంసాక్షి): పరకాలలో బీసీ సంఘాల మీడియా సమావేశం. పద్మశాలీ సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్ గడ్డం భాస్కర్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి. పరకాల రిటైర్డ్ ఉద్యోగుల కార్యాలయంలో బీసీ సంఘాల మీడియా సమావేశం. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరకాల, పద్మశాలీ సమాజానికి శాసనమండలిలో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని వివిధ బీసీ కుల సంఘాలు కోరారు. కాకతీయ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు, ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ గడ్డం భాస్కర్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తున్నారని, గాంధీ జయంతి రోజున సిరిసిల్లలో పద్మశాలీలకు ఎమ్మెల్సీ ఇస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. చేనేత రంగంపై, విద్యా-పరిశోధన రంగాల్లో విశేష అనుభవం ఉన్న ప్రొఫెసర్ భాస్కర్ కు అవకాశం ఇస్తే చేనేత కార్మికుల సమస్యలు, బీసీ వర్గాల అభివృద్ధికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ భాస్కర్ 51 పరిశోధనా పత్రాలు ప్రచురించారని, తెలంగాణ ఉద్యమంలో, కొండా లక్ష్మణ్ బాపూజీ మార్గదర్శకత్వంలో చేనేత రంగానికి సేవ చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఓ బి సి ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎం.ఎన్ మూర్తి, బీసీ లీడర్ తాళ్లపల్లి రామస్వామి, మాజీ మత్స్య పారిశ్రామిక సంఘ అధ్యక్షుడు సాదు రఘువీర్, నల్లెల్ల బిక్షపతి, గోనిగంటి రవి, శ్రీకాంత్, బైరి రవి, సాయికుమార్, సునీల్, బిక్షపతి, జనార్ధన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీ పారదర్శకంగా చేపడుతున్నాం

ఉద్యోగాలు ఇప్పిస్తామనే దళారుల మాటలు నమ్మొద్దు నాలుగు రోజులపాటు జరగనున్న ఇంటర్వ్యూలు

ఇంటర్వ్యూలను నిర్వహించిన కమిటీ చైర్మన్ మరియు జిల్లా కలెక్టర్ బోర్డుడే హేమంత్ సహదేవరావు



ములుగు ప్రతినిధి, నవంబర్ 04(జనంసాక్షి). అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ పోస్టుల భర్తీ ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ బోర్డుడే హేమంత్ సహదేవరావు తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే దళారుల మాటలు నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని స్పష్టం చేశారు. బుధవారం ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆర్డీఓ కృష్ణవేణి, ఎస్ డి సి ప్రతాప్, డి ఎం హెచ్ ఓ గోపాలరావు, డి డబ్ల్యు ఓ ప్రేమలత ఫైవ్ మెన్ కమిటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అభ్యర్థుల అర్హతలను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ఎంపిక చేస్తున్నామని తెలిపారు. ఎంపిక ప్రక్రియలో దళారుల ప్రమేయానికి తావులేదని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని సూచించారు. జిల్లాలోని తాడ్వాయి, వెంకటాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న 31 అంగన్‌వాడీ టీచర్, 104 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి నవంబర్ 4 నుంచి 7వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తొలిరోజు తాడ్వాయి ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ పోస్టుల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. నవంబర్ 5న వెంకటాపురం ప్రాజెక్టు అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు, 6న తాడ్వాయి ప్రాజెక్టు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు, 7న వెంకటాపురం ప్రాజెక్టు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు.

మోడల్ గ్రామంగా అక్కంపేట : హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

పాఠశాల దశ నుండే విద్యార్థులు జీవిత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



ఆత్మకూర్ నవంబర్ 4 (జనం సాక్షి): తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ స్వగ్రామం అక్కంపేట అభివృద్ధికి రూ. 10 కోట్లతో చేపట్టనున్న ప్రతిపాదిత అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్ జెడ్పి ఉన్నత పాఠశాల, పీఎం ఉన్నత పాఠశాలలను సందర్శించిన జిల్లా కలెక్టర్. తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ స్వగ్రామం అక్కంపేట ను మోడల్ గ్రామంగా తీర్చిదిద్దే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండలం అక్కంపేట గ్రామంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ స్వగ్రామ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 10 కోట్లు మంజూరు చేసిన నేపథ్యంలో ప్రతిపాదిత అభివృద్ధి పనులను స్థానిక సర్పంచ్ సాంబయ్య, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులతో కలిసి జిల్లా కలెక్టర్ గ్రామంలోని ఎస్సీ కాలనీ, యాదవ కాలనీ, తదితర కాలనీలలో పర్యటించారు. గ్రామంలో ప్రతిపాదిత సిసి రోడ్లు, డ్రైనేజీలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామపంచాయతీ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించగా గ్రామ సర్పంచ్ సాంబయ్య, తదితరులు జిల్లా కలెక్టర్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. గ్రామంలోని కోదండ రామాలయం, రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వీబీజీ రాంజీ ద్వారా నిర్మిస్తున్న కమ్యూనిటీ శానిటేషన్ కాంప్లెక్స్ పనులను జిల్లా కలెక్టర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ గ్రామాన్ని మోడల్ గ్రామంగా అభివృద్ధి చేసే ప్రణాళికలో భాగంగా వివిధ శాఖల ద్వారా అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను సందర్శించి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి భవిష్యత్తు లక్ష్యాల గురించి ఆరా తీశారు. పాఠశాలలో మాక్ టెస్టులు నిర్వహిస్తున్నారా లేదా అని ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పిఎంశ్రీ ప్రాథమిక పాఠశాలను, అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి ఎంతమంది విద్యార్థులు వస్తున్నారని ఆరా తీశారు. విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. తాగునీటి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల దశ నుండే విద్యార్థులు జీవిత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుండే జీవితంలో సాధించాలనుకున్న లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ ఆసక్తి, అభిరుచులకు అనుగుణంగా కెరీర్‌ను ఎంచుకోవాలని తెలిపారు. పాఠశాల విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడి, మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల విజయాల గ్రాఫ్ పెరగడంతో పాటు అక్కంపేట గ్రామానికి ఉన్న చరిత్రను విద్యార్థులు నిలబెట్టాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రాంగణంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి అన్ని రకాల కూరగాయలను పండించాలని సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓ విజయ్ కుమార్, మండల వ్యవసాయ అధికారి యాదగిరి, పంచాయతీ రాజ్ ఏఈ బాబురావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రంజిత్ కుమార్, ఏఈఈ సుదర్శన్, ఏపీవో రాజిరెడ్డి, ఇతర శాఖల అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

దూడలకు నట్టల నివారణ మందులను వేయించాలి

జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు బాలాజీ



చెన్నారావుపేట, నవంబర్ 4 (జనం సాక్షి): దూడలకు నట్టల నివారణ మందులను వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు బాలాజీ అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మరాయినిపహాడ్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో దూడలకు నట్టల నివారణ కార్యక్రమంను నిర్వహించారు. గ్రామంలోని 35 దూడలకు నట్టల నివారణ మందులను అందించినట్లు తెలిపారు. గ్రామాలలోని పశువుల పెంపకం దారులు తమ పశువులకు నట్టల నివారణ మందులను తప్పకుండా వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దారావత్ రమేష్, మండల పశువైద్యాధికారి డాక్టర్ జునేద్ ఖాన్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ శ్రవణ్, ప్రముఖ పాడి రైతు కొండవీటి ప్రదీప్ కుమార్‌తో పాటు, పాడి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటుహక్కును నమోదు చేసుకోవాలి

కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల మండల కో ఆర్డినేటర్ తప్పెట రమేష్



చెన్నారావుపేట, నవంబర్ 4 (జనం సాక్షి): పట్టభద్రులు ఓటుహక్కును నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల మండల కో ఆర్డినేటర్ తప్పెట రమేష్ అన్నారు. బుధవారం చెన్నారావుపేట మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ - ఖమ్మం - నల్గొండ నియోజకవర్గం గ్రాడ్యుయేట్స్ ఎన్నికల కోసం చెన్నారావుపేట మండలంలోని పట్టభద్రులు తమ ఓటుహక్కును నమోదు చేసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఓటుహక్కును నమోదు చేసుకోవడానికి భారతదేశంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి తేది 01- 11- 2023 లోపు గ్రాడ్యుయేషన్ / డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకొనుటకు అర్హులని గతంలో ఓటు హక్కు కలిగి ఉన్న పట్టభద్రులు కూడా మళ్ళీ ఫారం 18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటు నమోదు చేసుకోవాలనుకుంటున్న పట్టభద్రులు నియోజకవర్గంలో సాధారణ నివాసిగా ఉండాలని పట్టభద్రులైన యువకులు ఉద్యోగులు, విద్యావంతులు ప్రతిఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మహాదేవపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



మహాదేవపూర్, నవంబర్ 4 (జనంసాక్షి): జిల్లాలో పోలీస్ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ బుధవారం మహాదేవపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని, సీసీ కెమెరాల పనితీరును, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, కేసులను త్వరితగతిన పరిష్కరించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తూ, నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి పోలీస్ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. కాటారం డీఎస్పీ సూర్యనారాయణ. సీఐ వెంకటేశ్వర్లు. ఎస్ఐ సాంబమూర్తి ఉన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



మహాదేవపూర్, నవంబర్ 4 (జనంసాక్షి): మహాదేవపూర్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నూకల వెంకన్న ఇటీవల మృతి చెందగా, బుధవారం నిర్వహించిన ఆయన దశదిన కర్మ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, సింగిల్ విండో చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కటకం అశోక్, స్థానిక సర్పంచ్ హసీనా భాను, మాజీ ఎంపీటీసీ ఆకుతోటే సుధాకర్. తదితరులు వెంకన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుర్రి శివరాజ్. తడుకల జగదీష్. మాజీ ఎంపీటీసీ ఆకుతోట సుధాకర్. కడర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



చెన్నారావుపేట, నవంబర్ 4 (జనం సాక్షి): మండలంలోని అక్కల్ చెడ గ్రామంలోని కట్టయ్య పల్లికి చెందిన ఈగ ఉమాదేవి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతూ బుధవారం మరణించింది. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు పులిశేరు రాజేందర్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి వెళ్లి ఆమె మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం మృతురాలి భర్త ఈగ సాగర్, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తూటి రమేష్, బోనగిరి సారయ్య, గంట వీరన్న, బాదావత్ వీరు, బొంత సురేష్, లక్క ఇంద్రయ్య, తేజావత్ శివ, బాదావత్ వీరు, కరెడ్ల శివ, ఒంటరి అశోక్, సిద్ద జనార్దన్, బాదావత్ కిషోర్, కొత్త శ్రీకాంత్, చిలుక రాజేష్, వీరు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను కోల్పోయిన యువతులకు అండగా ఉంటాం :చింతకింది కుమారస్వామి



నల్లబెల్లి, నవంబర్ 04 (జనంసాక్షి): తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు యువతులకు సీపీఐ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని సీపీఐ కౌన్సిల్ సభ్యుడు చింతకింది కుమారస్వామి భరోసానీచ్చారు. అనారోగ్యంతో తల్లి మృతి చెందగా, మూడు రోజుల క్రితం తండ్రి వరికూరి శేఖర్ మరణించడంతో పెద్ద దిక్కును కోల్పోయిన కుమార్తెలు శ్రావణి, అంకితలను సీపీఐ నాయకులతో కలిసి ఆయన బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ.. పెద్ద కుమార్తె బీఈడీ పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురుచూస్తుండగా, చిన్న కుమార్తె డిగ్రీ చివరి సంవత్సరం చదువుతోందని తెలిపారు. వారి చదువు, భవిష్యత్తు బాధ్యతల విషయంలో అండగా ఉంటామని చెప్పారు. తల్లి పేరుపై ఉన్న వ్యవసాయ భూమి, ఇతర స్థిరాస్తుల పంపకాల విషయంలో తమకు న్యాయం చేయాలని యువతులు కోరారని, వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని కుమారస్వామి హామీ ఇచ్చారు. ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, మండల కార్యదర్శి పరికి కోర్నెల్ , మాజీ సర్పంచ్ చీకటి ప్రకాష్ ,మామిండ్ల పెద్ద ఐలయ్య, కడియాల క్రాంతికుమార్, నాగెల్లి జూనియర్ ప్రకాష్, బొద్దుల దశరథం, జన్ను జయరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వేరో ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



చెన్నారావుపేట, నవంబర్ 4 (జనం సాక్షి): ఈ నెల 22న నిర్వహించనున్న స్వేరో ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం చెన్నారావుపేట మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా ఆవిష్కరించారు.చెన్నారావుట మండల స్వేరో కన్వీనర్ నమిండ్ల సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాల్నె వెంకన్న, బిఆర్ఎస్ మండల ఎన్నికల ఇంచార్జ్ జక్క అశోక్‌లు పాల్గొని పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వేరో ఆత్మీయ సమ్మేళనం ద్వారా ఐక్యత ఆత్మగౌరవం విద్య సామాజిక చైతన్యం వంటి ఆశయాలను ప్రజల్లో మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.ఈ నెల 22న జరిగే ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్వేరో నర్సంపేట కన్వీనర్ కల్లెపల్లి సురేష్, స్వేరో చెన్నారావుపేట ఇన్‌చార్జ్ ఈదునూరి యాకన్న, స్వేరో కో కన్వీనర్ చిలువేరు చిరంజీవి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మురహరి రవి, మాజీ ఎంపీటీసీ మాదాసి కుమారస్వామి, మాజీ సర్పంచ్ కుండె మల్లయ్య, మాజీ కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, మండల ఉపాధ్యక్షులు కుసుమ నరేందర్, గ్రామ అధ్యక్షులు కందగట్ల సాంబయ్య, దుగ్గొండి స్వేరో నాయకులు గోవిందు మురారి, నర్మెట్ట సాంబయ్య, నమిండ్ల అనిల్, జన్ను నరేష్, రాజు, పాల్గొన్నారు.

అనారోగ్యంతో విజయ జ్యోతి మహిళా పాడుపు సంఘం అధ్యక్షురాలి మృతి



చెన్నారావుపేట, నవంబర్ 4 (జనం సాక్షి): అనారోగ్యంతో చెన్నారావుపేటలోని విజయ జ్యోతి మహిళా పొదుపు సంఘం అధ్యక్షురాలు ఈగ ఉమాదేవి మృతి చెందింది. ఈమె గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. బుధవారం ఆరోగ్యం క్షీనించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి భర్త ఈగ సాగర్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతి పట్ల విజయ జ్యోతి మహిళా పొదుపు సంఘం బాధ్యులు, సభ్యులు, గ్రామంలోని పలువురు ఆమె మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు.

ఎంపీ వంశీకృష్ణ లేఖను ఖండించిన కాంగ్రెస్ నేతలు

మంత్రి శ్రీధర్ బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు చంద్రగిరి అశోక్



మల్హర్, నవంబర్ 04 (జనం సాక్షి) గణపతి సచ్చిదానంద స్వామీజీ మంథని పర్యటనపై ఎంపీ గడ్డం వంశీకృష్ణ రాసిన లేఖను మల్హర్ రావు మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రుద్రారం ఏడో వార్డు సభ్యుడు చంద్రగిరి అశోక్ ఖండించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదని అన్నారు. స్వామీజీ పర్యటనతో ప్రాంతంలో ఆధ్యాత్మికత, ప్రశాంతత, సోదరభావం పెంపొందుతాయని పేర్కొన్నారు. పర్యటన ఖర్చులపై ఎంపీ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. వివరాలు తెలియకుండా ఆరోపణలు చేయడం తగదన్నారు.మంత్రి శ్రీధర్ బాబు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని, రాహుల్ గాంధీ పాదయాత్రతో పాటు ఇతర రాష్ట్రాల్లో పార్టీ బాధ్యతలను సమర్థంగా నిర్వహించారని కొనియాడారు. ఎంపీగా గెలిపించిన నాయకుల కృషిని గుర్తించాలని సూచించారు. మంథిని ప్రాంతంలో కాంగ్రెస్ నాయకులను కలుపుకొని వెళ్లాలని, పార్టీ ఐక్యతకు భంగం కలిగించే విధంగా వ్యవహరించవద్దని హితవు పలికారు. ఎంపీ వ్యవహారశైలిపై ఆధారాలతో సహా పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తామని అశోక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో నాలుగో వార్డు సభ్యుడు గాదె గట్టయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంగం సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ నాయకులు మంతెన మహేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆర్థిక సాయం



గీసుకొండ మండలం, నవంబర 4, (జనం సాక్షి) గీసుగొండ నవంబర 4: గీసుకొండ మండలంలోని నందనాయక్ తండా గ్రామానికి చెందిన భూక్యా రమేష్ అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన వంతు సహాయంగా రూ.5,000 ఆర్థిక సాయం అందజేసి, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గీసుగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాడి శివ, జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మనపెల్లి శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు జన్ను రమేష్, నాకినబోయిన నాగరాజు, గ్రామ సర్పంచ్ భూక్యా వీరేందర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వంకుడోతు నర్సింహా, కాంగ్రెస్ నాయకులు కూసం రమేష్, కన్నెబోయిన ప్రవీణ్, కొమ్మాల గ్రామ పార్టీ అధ్యక్షులు కడారి రాజు, బాధావత్ రమేష్, రాంబాబు, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ కుటుంబాన్ని పరామర్శించిన టీజేపీ నాయకులు



వెంకటాపూర్ (రామప్ప), నవంబర్ 04(జనం సాక్షి):- సీనియర్ జర్నలిస్ట్ రాయల గోపి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబాన్ని బుధవారం తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేపీ) ములుగు జిల్లా కమిటీ నాయకులు పరామర్శించారు.వెంకటాపూర్ మండలం జవహర్ నగర్ గ్రామానికి చెందిన రాయల గోపి మరణించి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన నివాసానికి వెళ్లిన టీజేపీ నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం అందించారు. జర్నలిస్ట్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కమిటీ తరఫున కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో టీజేపీ ములుగు జిల్లా అధ్యక్షుడు బేతి సతీష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎనగందుల కొమురయ్య, ఉపాధ్యక్షుడు చల్లగురుగుల రాజు, కోశాధికారి సంగ రంజిత్ కుమార్, సంయుక్త కార్యదర్శి గట్టు ప్రశాంత్, సభ్యులు పెండెం బిక్షపతి, కోల కోటి పాల్గొన్నారు.

రామప్ప ఆలయల హుండీ ఆదాయం రూ. 8 లక్షల 73 వేలు



వెంకటాపూర్ (రామప్ప),నవంబర్ 04 (జనం సాక్షి):- వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామం లో గల శ్రీ రామలింగేశ్వర స్వామి (రామప్ప) దేవస్థానం హుండీలను బుధవారం లెక్కించారు. ఆలయంలో ఉదయం 11 గంటలకు ఆలయ ఇన్స్పెక్టర్,పరిశీలకులు డి. అనిల్ కుమార్ సమక్షంలో హుండీలు తెరిచి లెక్కించారు.కాగా,ఈ లెక్కింపులో నోట్లు రూ. 7,85,720 లు రాగా, నాణేలు రూ. 87,850 వచ్చాయి. హుండీల ఆదాయం మొత్తం రూ. 8,73,570 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఇమ్మడి భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కె. హరీష్ శర్మ, అర్చకుడు ఉమశంకర్, వెంకటాపూర్ డిప్యూటీ తహసీల్దార్ భవానిప్రసాద్, పాలంపేట సర్పంచ్ చల్లగొండ రాజు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ రమేష్, పోలీస్ సిబ్బంది, శ్రీరాజరాజేశ్వర సేవా సమితి హన్మకొండ సభ్యులు, ఆలయ సిబ్బంది, పురావస్తు శాఖ సిబ్బంది, టూరిజం గైడ్లు విజయ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పాలకుర్తి విద్యార్థులు



పాలకుర్తి, నవంబరు 04(జనంసాక్షి) ఈ నెల 5, 6 తేదీల్లో హైదరాబాద్ లోని పోలీస్ మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పాలకుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పాయం శోభారాణి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆమె మాట్లాడారు. ఇటీవల జనగామలో జరిగిన పీఎంశ్రీ పాఠశాల విద్యార్థులకు నిర్వహిం చిన కబడ్డీ పోటీల్లో పాలకుర్తిలో పదవ తరగతి చదువుతున్న లాకావత్ వరుణ్, బానోతు రాకేష్, బానోతు ఐశ్వర్యలతో పాటు తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని అంగడి అక్షర మంచి ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర కబడ్డీ క్రీడలకు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను పీడీ మామిండ్ల సోంమల్లు, ఉపాధ్యాయులు రమేష్, బలరామ్ తదితరులు అభినందించారు.

రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలు సాగు చేయాలి: ఏఓ బన్న రజిత



నల్లబెల్లి, నవంబర్ 04 (జనంసాక్షి): ప్రస్తుతం ఎల్ నీనో ప్రభావం కారణంగా, సాగు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని యాసంగిలో రైతులు ముందస్తు ప్రణాళిక ప్రకారం పంటలు సాగు చేయాలని ఏవో బన్న రజిత పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అర్షణపల్లి, నారక్కపేట గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖేతీ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాగు భూముల సంరక్షణ, భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, నీటి పొదుపు, సేంద్రియ ఎరువుల ప్రాధాన్యతపై రైతులకు అవగాహన కల్పించారు. యాసంగిలో వరికి ప్రత్యామ్నాయంగా పెసర, మినుము, శనగ, వేరుశనగ, కుసుమ, పొద్దుతిరుగుడు వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని సూచించారు. పంట మార్పిడి పద్ధతులతో భూసారాన్ని కాపాడుకోవాలని తెలిపారు. అధిక మోతాదులో రసాయన ఎరువులు, పురుగులు మందుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, జీవ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియ దున్నటం వలన భూసారాన్ని మెరుగుపరచవచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో అర్షణపల్లి సర్పంచ్ సిద్ధ సంతోష్, నారక్కపేట సర్పంచ్ దండెం సంపత్, ఉద్యానవన అధికారి జ్యోతి, ఏఈవోలు శివకుమార్, త్రివేణి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో..
ఉద్యోగ భద్రత కోసం పోరాటం

23వ రోజుకు చేరిన ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె



నిర్మల్ బ్యూరో. నవంబ్ర 04, (జనంసాక్షి): ఉద్యోగ భద్రత, రెగ్యులరైజేషన్ డిమాండ్ల సాధన కోసం ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 23వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. భూమి హక్కుల కోసం ఐలమ్మ పోరాడిన స్ఫూర్తితో తాము ఉద్యోగ భద్రత కోసం ఉద్యమిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 5 శాతం వార్షిక ఇంక్రిమెంట్, 8 శాతం లాయల్టీ బోనస్ చెల్లించాలని, కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు గంగాధర్, జిల్లా కోఆర్డినేటర్ రమణ, నాయకులు డాక్టర్లు రమేష్, అలీ, శ్రీమంత్, సన్నిత్, రాణా ప్రతాప్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

బురహాన్ పల్లికి బస్సు సౌకర్యం



రాయపర్తి,నవంబర్ 04 (జనంసాక్షి):బురహాన్ పల్లి గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచే దిశగా బురహాన్ పల్లి నుంచి హైదరాబాద్‌కు బస్సు సర్వీస్ ప్రారంభమైంది.ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఈ బస్సు సర్వీస్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు.దీంతో గ్రామ ప్రజలకు హైదరాబాద్‌కు రాకపోకలు సాగించేందుకు మరింత సౌకర్యం కలగనుంది.గ్రామం నుంచి హైదరాబాద్‌కు నేరుగా బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడంతో ప్రజలు ,ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూదుల ఉమాదేవి,కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఇంతల వీరారెడ్డి,ఉప సర్పంచ్ భూక్య శ్రీనివాస్,నాయకులు కూస మహేందర్, ఖమ్మం సోమన్న, పిట్టల యాకన్న, బొమ్మేరబోయిన వీరన్న,కప్పల కుమారస్వామి, కప్పల సుదర్శనం, గొల్లపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరమార్శ

నివాళులు అర్పించిన బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాల్నె వెంకన్న



చెన్నారావుపేట, నవంబర్ 4(జనం సాక్షి): బిఆర్ఎస్ నాయకులు ఈగ సాగర్ భార్య ఈగ ఉమాదేవి అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతదేహం పై బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాల్నె వెంకన్న పూల మాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఆయన వెంట మాజీ జెడ్పిటిసి జున్నుతుల రాంరెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ మురహరి రవి, మాజీ సర్పంచ్ కుండె మల్లయ్య, మాజీ జిల్లా పరిషత్ కో ఆప్షన్ మెంబర్ మహ్మద్ రఫీ, మండల ఉపాధ్యక్షులు కుసుమ నరేందర్, మండల మాజీ కో ఆప్షన్ మెంబర్ గఫ్ఫార్, గ్రామ అధ్యక్షులు కందగట్ల సాంబయ్య, జున్నుతుల శ్రీధర్ రెడ్డి, వార్డు మెంబర్లు రాసమల్ల సతీష్, గొడిశాల సురేందర్, మూడు రమేష్, మండల సోషల్ మీడియా ఇంచార్జ్ బోడ మురళి నాయక్, కేతిడి జైపాల్ రెడ్డి, ఎడ్ల మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

దూడలు,లేగలను నట్టల నుంచి సంరక్షించుకోవాలి

గ్రామ సర్పంచ్ గుజే సుధాకర్



రాయపర్తి,నవంబర్ 04 (జనంసాక్షి): పశువులను నట్టల బారిన పడకుండా సంరక్షించుకోవాలని కేశవపూరం గ్రామ సర్పంచ్ గుజే సుధాకర్ సూచించారు.కొండూరు పశు ఆరోగ్య ఉపకేంద్రం పశుసంపద సహాయకుడు దాసరి శంకర్ ఆధ్వర్యంలో గ్రామంలో దూడలు, లేగలకు నట్టల నివారణ మందులు తాగించే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పశువైద్య శాఖ అందించే ఉచిత మందులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని,పశువులకు అనారోగ్యం కలిగితే వెంటనే పశు ఆరోగ్య ఉపకేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.దాసరి శంకర్ మాట్లాడుతూ పశువులకు నట్టల నివారణ మందులను పశువైద్యుల సూచనల మేరకు అందించాలని తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో పశుగ్రాస కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున 75 శాతం సబ్సిడీపై లభించే పశుగ్రాస విత్తనాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పద్మ భూషణ్ స్వామి,వార్డు సభ్యుడు కృష్ణ,కారోబార్ దేవేందర్, రైతులు దయాకర్,నరసయ్య,మల్లయ్య,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు మరో ముందడుగు

సర్వాయిపేటలో మహిళా సంఘాల భవన నిర్మాణానికి భూమిపూజ



(పలిమెల నవంబర్ 4 జనం సాక్షి) జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం సర్వాయిపేట గ్రామంలో మహిళా సాధికారతను మరింత ప్రోత్సహించే దిశగా సర్వాయిపేట గ్రామంలో మరో ముందడుగు పడింది. ఇందులో భాగంగా సర్వాయిపేట గ్రామంలో మహిళా సంఘాల భవన నిర్మాణానికి ముగ్గు వేసి, ఘనంగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించి పనులను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లంగారి రాజు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతూ, ఐకమత్యంతో ముందుకు సాగేందుకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. మహిళల అభివృద్ధే గ్రామ అభివృద్ధికి పునాది అని, మహిళా సంఘాల బలోపేతానికి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మన గ్రామం అభివృద్ధి మనందరి బాధ్యత అని ఈ సందర్భంగా సర్పంచ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లపై కల్లాలను ఏర్పాటు చేస్తే చర్యలు

సీఐ భరత్ సుమన్



పాలకుర్తి, నవంబర్ 04 (జనంసాక్షి) రోడ్లపై జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని రోడ్లపై ఆరబోస్తే చర్యలు తప్పవని సీఐ భరత్ సుమన్ సూచించారు. బుధవారం ఆయన ఎస్సై సృజన్ కుమార్ తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలోని నాలుగు రోడ్లకు ఇరువైపులా వరి ధాన్యాన్ని రైతులు ఆరబోయవద్దని సూచించారు. గతంలో మండలంలో పలువురు మోటార్ సైకిల్ పై వెళుతుండగా అదుపుతప్పి ప్రమాదాలు జరిగి మృతిచెందిన ఘటనలు ఉన్నాయని తెలిపారు. రోడ్లపై వరి ధాన్యాన్ని ఆరబోయవద్దని. రైతులు వారి చేలుకల వద్ద కల్లాల ఏర్పాటు చేసుకొని అక్కడే ఆరబోయాలని సూచించారు. రోడ్లపై వరి ధాన్యాన్ని ఆరబోస్తే ఏమైనా ప్రమాదాలు జరిగితే ఆ రైతే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఇప్పటికైనా రైతులు వరి ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయ వద్దని సూచించారు. ఒకవేళ రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

డిగ్రీ కాలేజీలో వికసిత్ భారత్
యంగ్ లీడర్స్ డైలాగ్ : యూత్ పార్లమెంట్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేరా యువభారత్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ -- యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన అధికారి భూక్య సంజీవ్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా వన్ నేషన్ -- వన్ ఎలక్షన్ అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల విధానం, జాతీయ అభివృద్ధిలో యువత పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి జిల్లా క్రీడల అధికారి రఘు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఏ. రమణారావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మహమ్మద్ రుక్సానా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ కవిత, డాక్టర్ చంద్రకళ, డాక్టర్ లక్ష్మీనారాయణ, రాధిక న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేశారు. మేరా యువభారత్ ప్రోగ్రాం ఆర్గనైజర్ వెల్దండ సురేష్ సమన్వయం చేసిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యువతలో నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య విలువలు, వక్తృత్వ నైపుణ్యాలు పెంపొందించి వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వాములను చేయడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

మృతుని కుటుంబ సభ్యులను

పరామర్శించిన మాజీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్



టేకుమట్ల నవంబర్ 04 జనంసాక్షి టేకుమట్ల మండలం గర్మిల్లపల్లి గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దాసరపు సదానందం తండ్రి నిన్న అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరామర్శించిన కోటగిరి సతీష్ గౌడ్,ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంగీ రవి.మండల ఉపాధ్యక్షుడు మాదం కొమురయ్య.గ్రామ సర్పంచ్ పచ్చిక దిలీప్ రెడ్డి.ఉపసర్పంచ్ నల్లవెల్లి మొండయ్య.మండల నాయకులు కోరే చందు.అమ్ము తిరుపతి.తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడి కుటుంబానికి అండగా మున్సిపల్ చైర్మన్ బాలమణి శ్రీనివాస్

- రూ.లక్ష ఆర్థిక సాయం అందజేత
- పిల్లల ఉన్నత చదువులకు పూర్తి భరోసా
- భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు ఎంపీ చామల హామీ



బచ్చన్నపేట, (జనం సాక్షి):జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నే గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ ఆత్మహత్య ఘటనతో చలించిపోయిన మున్సిపల్ చైర్మన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అండగా నిలిచారు. ఆర్థిక సహాయం తన సొంత నిధుల నుండి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో బాధిత కుటుంబానికి అందజేశారు. అంతేకాకుండా పిల్లలు ఉన్నత చదువులు చదివే వరకు అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తానని భార్యకు మెడికల్ కాలేజీలో ప్రభుత్వ ఉద్యోగం కల్పించేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఎంపీ స్పందన భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడి పరామర్శించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, బాధిత కుటుంబానికి తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు విద్యానాథ్, గంగరబోయిన మహేందర్, డిడిగా రమేష్, చెరుకూరి శ్రీనివాస్, అఖిల్ మాల, మాజీ ఎంపీటీసీ ఆగయ్య, గుత్తి సిద్దిరాములు, యాట మహేందర్, స్థానిక నాయకులు రాజు, కొక్కొలకొండ బాబు, గున్నల సందీప్, మాజీ సర్పంచ్ వేముల నిమ్మ కరుణాకర్ రెడ్డి, కాంగ్రెస్ యువజన నాయకులు కల్లం రమేష్, మల్లయ్య తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో మెట్లకు శిక్షణ

హాజరైన ఎంపీడీవో విజయశ్రీ



స్టేషన్ ఘన్‌పూర్,నవంబర్ 04 (జనం సాక్షి) : స్టేషన్ ఘన్పూర్ మండలంలోని 15 గ్రామ పంచాయతీలకుసంబంధించిన మెట్లకు స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో విజయశ్రీ అధ్యక్షతన శిక్షణకార్యక్రమం శిక్షణ ఏర్పాటు చేయడం జరిగినది.మెట్ల విధులు బాధ్యతలు, కొలతలు ఇవ్వడం, కొలతలు తీసు కోవడం,మాస్టరు విధానం ఎన్ఎంఎంఎస్ అటెండె న్స్ అప్లోడ్, చేసేలా చేయడం,జాబ్ కార్డు అప్డేట్ చేయడం, కూలీల చెల్లింపు ఏ విధంగా జరుగుతా యి, కూలీల పేమెంట్లు ఏ విధంగా వారి అకౌంట్లో క్రెడిట్ అయినవి చూడవచ్చు వంటి వాటిపై ఎంపీ డీవో శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్ర మంలో ఎంపీడీవో విజయశ్రీ, ఏపీవో ప్రేమయ్య టెక్నికల్ అసిస్టెంట్ కరుణాకర్, సునీత జాంబ, కంప్యూటర్ ఆపరేటర్ మీనాక్షి ,ఫీల్డ్ అసిస్టెంట్లు అమీనా ,మాధురి ,రజిత , మంజుల వివిధ గ్రామాల మెట్లు పాల్గొనడం జరిగింది.

రైతు భరోసా పై స్పష్టతనివ్వాలి



నల్లబెల్లి, నవంబర్ 04 (జనంసాక్షి): రైతు భరోసా నిధులపై స్పష్టతనివ్వాలని బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు తడక వినయ్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని రేవంత్ సర్కార్ తప్పుడు ప్రచారం చేస్తూ రైతులను అయోమయానికి గురి చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో రైతులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రస్తుతం రైతు భరోసా నిధులు విడుదల చేసినట్లు ప్రకటనలు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో చాలామంది రైతుల ఖాతాల్లో నగదు జమ కాలేదని ఆయన ఆరోపించారు. తమ ఖాతాల్లో రైతు భరోసా సొమ్ము జమ కాలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఒకవైపు ప్రభుత్వం నిధులు విడుదలైనట్లు ప్రకటనలు చేస్తుండగా, మరోవైపు రైతులకు డబ్బులు అందకపోవడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అన్నారు. ప్రభుత్వ ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో నెలకొన్న వాస్తవ పరిస్థితులకు పొంతన లేదని పేర్కొన్నారు.రైతు భరోసా నిధుల విడుదలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని, ఇప్పటివరకు ఎంతమంది రైతుల ఖాతాల్లో ఎంత మొత్తం జమ చేశారో పారదర్శకంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసా సొమ్ము అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.. రైతులకు ప్రకటనలు, హామీలు అవసరం లేదని, వారి ఖాతాల్లో నగదు జమ కావాలని వినయ్ గౌడ్ స్పష్టం చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు భారతీయ జనతా పార్టీ రైతుల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుందని తెలిపారు.

జయశంకర్ భూపాలపల్లి

జిల్లా డాన్సర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా డాన్సర్స్ యూనియన్ నూతన కమిటీని గౌరవ అధ్యక్షులు దుర్గం రమేష్, సానా సుధాకర్, కప్పల రాజేష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. నూతన కమిటీలో అధ్యక్షుడిగా సొల్లు రాజశేఖర్ (శేఖర్ మాస్టర్), ఉపాధ్యక్షుడు, కోశాధికారిగా తూర్పాటి నాని మాస్టర్, ఉపాధ్యక్షుడిగా రామిళ్ళ రాకేష్ మాస్టర్, జనరల్ సెక్రటరీగా నరేష్ జీవ మాస్టర్, జాయింట్ సెక్రటరీగా దూట తిరుపతి (నెమో) మాస్టర్, ప్రెస్ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ గా రాపర్తి పవన్ మాస్టర్, ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ గా చాగల రాకేష్ మాస్టర్ ఎన్నికయ్యారు. ఈసీ సభ్యులుగా శ్రావణ్, మహేష్, కళ్యాణ్, బబ్లు, కుశాల్, అఖిల్, రంజిత్, అనిల్, రఘు, హరికృష్ణ, శ్రీకాంత్, సాయిచంద్, శివ, రాజు తదితరులు ఎన్నికయ్యారు.

జర్నలిస్టుల సమస్యలపై టీయూడబ్ల్యూజే

రాష్ట్ర విస్తృత కార్యవర్గంలో సభ్యుల గళం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా హైదరాబాద్ మియాపూర్-చందానగర్ లో నిర్వహించిన తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ విస్తృత కార్యవర్గ సమావేశంలో సభ్యులు తమ గళాన్ని వినిపించారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామంతుల శ్యామ్ హాజరయ్యారు. జర్నలిస్టుల సమస్యలపై ప్రస్తావించారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర కార్యదర్శి రామ్ నారాయణ సమక్షంలో ముఖ్య అతిథిగా హాజరైన మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డికి ఈ సమస్యలను వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారు. హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలపై త్వరలోనే సానుకూల స్పందన వస్తుందని తెలిపారు.

బియ్యం అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు

అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి సాదిక్ హుస్సేన్ హెచ్చరిక



కెరమేరి, నవంబర్ 4 (జనంసాక్షి) బియ్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి సాదిక్ హుస్సేన్ హెచ్చరించారు. బుధవారం కేరమేరి మండల కేంద్రంలోని కిరాణా దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సన్న బియ్యాన్ని విక్రయించాలని స్పష్టం చేశారు. ప్రతి కిరాణా దుకాణంలో బియ్యం ధరల సూచిక బోర్డులను ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారస్తులను ఆదేశించారు. ధరల విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాష్ట్రంలో సన్న బియ్యం నిల్వలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడుతూ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయరాదని, ప్రజలను భయాందోళనకు గురి చేయవద్దని హెచ్చరించారు. అధిక ధరల విషయంలో ప్రభుత్వం సీరియస్ గా ఉందని చెప్పారు. అంతకుముందు పరండోలి,ముఖద్దంగూడ, తుమ్మగూడలోని రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన వెంట డిప్యూటీ తాసిల్దార్ సంతోష్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ పవన్, జిపిఓ విస్వాస్ వ్యాపారస్తులు ఉన్నారు.

జలసిరి కార్యక్రమంలో

ఇంకుడు గుంతల నిర్మాణ పనులు ప్రారంభం


అంతర్నీ గ్రామంలో అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీవో భీమేశ్



కుబీర్, నవంబర్ 04, (జనంసాక్షి): కుబీర్ మండలంలోని అంతర్నీ గ్రామపంచాయతీని బుధవారం ఎంపీవో భీమేశ్ సందర్శించి గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిని అడిగి తెలుసుకుని, పనులు ఏ దశలో ఉన్నాయనే వివరాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జలసిరి కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులను ప్రారంభించారు. వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకించే విధంగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. భూగర్భ జలాల పెంపునకు నీటి సంరక్షణ చర్యలు ఎంతో అవసరమని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. గ్రామంలో చేపడుతున్న పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో జీపీ రికార్డులను పరిశీలించి సంబంధిత వివరాలను తనిఖీ చేశారు.

సింగరేణి పెన్షనర్ల కోసం

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపులు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): సింగరేణి సంస్థలో పదవీ విరమణ పొందిన పెన్షనర్ల సౌకర్యార్థం డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పణకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు భూపాలపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్ తెలిపారు. నవంబర్ 11, 12 తేదీల్లో కృష్ణా కాలనీ మినీ ఫంక్షన్ హాల్‌లో ఈ క్యాంపులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పెన్షనర్లు ప్రతి ఏటా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడం పెన్షన్ కొనసాగింపునకు అవసరమని, డిజిటల్ విధానం ద్వారా ధ్రువీకరణ ప్రక్రియ సులభతరం అవుతుందని వివరించారు. వయోవృద్ధ పెన్షనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత తేదీల్లో హాజరై ధ్రువీకరణ పూర్తి చేసుకోవాలని కోరారు.

జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం



బెల్లంపల్లి, నవంబర్ 4, (జనంసాక్షి) బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ వద్ద బుధవారం జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఈసందర్భంగా జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని, ఆకలితో ఉన్నవారి ఆకలి తీర్చడం సంతోషంగా ఉందని, దాతల సహకారంతో జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం ఉగాది సందర్భంగా 2012 ఏప్రిల్ 13న ప్రారంభించామన్నారు. దాతల సహకారంతో ప్రతి బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. నేడు 447వ సారి నేత్రదాత జెడల రమేష్ జ్ఞాపకార్థం జనహిత అన్నపూర్ణ శాశ్వత అన్నదాతల సహకారంతో యాచకులకు, నిరుపేదలు, కూలీలు, చిరువ్యాపారులు, బాటసారులకి ఒక పూట ఆకలి తీర్చేందుకు అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ అన్నదాన కార్యక్రమం ద్వారా సుమారు 180 మందికి అన్నదానం చేశామన్నారు. ఈ జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం విజయవంతం కోసం మరింత మంది దాతలు ముందుకు రావాలని, సహాయ సహకారాలు అందిస్తున్న దాతలందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేత్రదాత కుటుంబ సభ్యులు, జనహిత సేవా సమితి గౌరవ సలహాదారుడు పూదరి నగేష్ గౌడ్, కార్యవర్గ సభ్యులు ఎల్లల పోశం, నిచ్చకోల గురుస్వామి, చిలుముల సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీజీ టెట్ మాక్ పరీక్షకు ఐదు కేంద్రాల్లో ఏర్పాట్లు

- నవంబర్ 5 నుంచి 10 వరకు మాక్ పరీక్షలు

ఐదు పరీక్షా కేంద్రాల్లో కంప్యూటర్ సాధనకు అవకాశం

- జిల్లా విద్యాశాఖ అధికారి డి. భోజన్న



నిర్మల్ , నవంబర్ 04,(జనంసాక్షి): జిల్లాలో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష కంప్యూటర్ ఆధారిత పరీక్షా విధానంపై అవగాహన కల్పించేందుకు నవంబర్ 5 నుంచి 10వ తేదీ వరకు మాక్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి. భోజన్న తెలిపారు. కడం, లక్ష్మణ్‌చందా, జుమ్మారాత్‌పేట్, కుంటాల, బాసరలోని ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అర్హులైన ఉపాధ్యాయులు వీటిలో తమకు అనుకూలమైన ఏదైనా ఒక కేంద్రానికి వెళ్లి మాక్ పరీక్ష రాయవచ్చు. తెలంగాణ పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లోనూ ఈ పరీక్ష అందుబాటులో ఉంటుంది. కంప్యూటర్ ఆధారిత పరీక్షా విధానంపై అవగాహన పెంచుకోవడంతో పాటు, సందేహాలను నివృత్తి చేసుకుని అసలు పరీక్షకు ముందస్తు సాధన చేసుకోవాలని ఆయన సూచించారు.

ఏసీబీ వలకు చిక్కిన బజార్‌హత్నూర్ ఎస్సై!

40 వేలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్గా పట్టుకున్న ఏసీబీ



బజార్హత్నూర్ (జనం సాక్షి):- ఆదిలాబాద్: జిల్లాలో అవినీతి అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఉక్కుపాదం మోపుతోంది. ఓ కేసు వ్యవహారంలో బాధితుడి నుంచి రూ.40 వేలు లంచం తీసుకుంటూ బజారాత్నూర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రమేష్ ఏసీబీ అధికారులకు దొరికిపోయారు. ఎస్సై వేధింపులు భరించలేకపోయిన బాధితుడు నేరుగా ఏసీబీ అధికారులను ఆశ్రయించి లిఖితపూర్వక ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో వెంటనే అప్రమత్తమైన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళిక రచించారు. ఏసీబీ డీఎస్పీ మధు ఆధ్వర్యంలో సిబ్బంది వ్యూహాత్మకంగా వలపన్నారు. పథకం ప్రకారం.. బాధితుడి నుంచి ఎస్ఐ రమేష్ రూ.40 వేల నగదు లంచం తీసుకుంటున్న తరుణంలో ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్గా పట్టుకున్నారు. లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న అధికారులు, ఎస్ఐ రమేష్ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బజార్హత్నూర్ పోలీస్ స్టేషన్లో విస్తృతంగా సోదాలు నిర్వహించి, కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి స్థాయి విచారణ కొనసాగుతుందని తెలిపారు.

జీవో నంబర్ 76 పట్టాల మంజూరు

అదనపు కలెక్టర్ రాములు



రామకృష్ణాపూర్, నవంబర్04(జనంసాక్షి): క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో జీవో నెంబర్ 76 లో కింద గతంలో ఇండ్ల పట్టాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి పట్టాలు మంజూరు చేయడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాములు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని రిటైర్మెంట్ కాలనీలో తహసిల్దార్ సతీష్ కుమార్ తో కలిసి బుధవారం పట్టాల స్థల పరిశీలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 76 లో గతంలో దరఖాస్తు చేసుకున్న వారికే ప్రస్తుతం పట్టాలు ఇవ్వడం జరుగుతుందని, దరఖాస్తు చేసుకున్నవారు నేరుగా తహసిల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ సూచనల మేరకు కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి అవకాశం ఉన్నట్లయితే త్వరలోనే సమాచారం అందిస్తామని పేర్కొన్నారు. పట్టాల మంజూరుకు స్థానిక ప్రజలు సహకరించాలని కోరారు. వారి వెంట ఆర్ఐ అంజనీకుమార్, సిబ్బంది ఉన్నారు.

ఆదివాసీ పల్లెల్లో దండారీ సంబరాలు

భోగితో ప్రారంభమైన గిరిజనుల సంప్రదాయ వేడుకలు

నెమలి ఈకల కిరీటాలతో గుస్సాడీల సందడి



సిరికొండ నవంబర్ 03 (జనంసాక్షి): ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దండారీ ఉత్సవాలు గిరిజన పల్లెల్లో సందడి చేస్తున్నాయి. దీపావళి పండుగను పురస్కరించుకుని అదివాసి గూడాల్లో భోగీ వేడుకలతో సంబరాలు ప్రారంభమయ్యాయి. సిరికొండ మండలంలోని రిమ్మ, తిమ్మపూర్, నేరడిగొండ (జి), సూర్యగూడ, పలు గ్రామల్లో సంప్రదాయబద్ధంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. డప్పులు, తుడుం, వెట్టె వాయిద్యాల మోతలతో పల్లెలు మార్మోగుతున్నాయి. నెమలి ఈకల కిరీటాలు ధరించిన గుస్సాడీల నృత్యాలు, సంప్రదాయ గీతాలు ఆదివాసీ సంబరాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

ఖానాపూర్ కోర్టుకు రెగ్యులర్ జడ్జి నియామకం



ఖానాపూర్ నవంబర్ 04 (జనం సాక్షి) ఖానాపూర్ కోర్టుకు రెగ్యులర్ జడ్జిగా బి.సి.నిఖిత నియమితులయ్యారు. దాదాపు గా రెండున్నర సంవత్సరాలుగా రెగ్యులర్ జడ్జి లేక వారానికి ఒకరోజే కోర్టు నడవడంతో న్యాయవాదులు, కక్షిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యపై ఖానాపూర్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు మట్టేరి రాజశేఖర్ నాయకత్వంలో న్యాయవాదుల బృందం హైకోర్టు, నిర్మల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తులను పలుమార్లు కలిసి వినతిపత్రాలు సమర్పించారు. వీరి కృషి ఫలితంగా ఇటీవల జరిగిన బదిలీల్లో ఇంచార్జి జడ్జిగా కొనసాగుతున్న బి.సి.నిఖిత ను పూర్తిస్థాయి రెగ్యులర్ జడ్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మట్టేరి రాజశేఖర్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నూతన జడ్జికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్మల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. రెగ్యులర్ జడ్జి రావడంతో బాధితులకు సత్వర న్యాయం అందుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ ఆసిఫ్ అలీ, సహాయ కార్యదర్శి బాశెట్టి శివ, సీనియర్ న్యాయవాదులు వెంకట్ మహేంద్ర, రాజురా సత్యం, కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు షబ్బీర్ పాషా, షేఖ్ ఖదీర్, రచమల్ల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ మహేందర్ జాదవ్ తల్లి మృతి

పరామర్శించిన బలరాం జాదవ్



నేరడిగొండ, నవంబర్ 04 (జనం సాక్షి) :- మండలంలోని సావర్గాం గ్రామానికి చెందిన సర్పంచ్, జిల్లా లైవ్ అధ్యక్షులు మహేందర్ జాదవ్ మాతృమూర్తి మృతి చెందారని తెలుసుకున్న రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే ముందటి సావుర్ గాం గ్రామానికి చెందిన గులాబ్ సింగ్ మృతి చెందారని తెలుసుకుని ఆయన కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు అందించాలి

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్



నిర్మల్ రూరల్ , నవంబర్ 04 ,(జనంసాక్షి) జిల్లాలోని ప్రతి అర్హులైన చిన్నారికి ప్రభుత్వ నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు అందించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ రోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముజ్జి పరిధిలోని మంజులాపూర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్న తీరును, టీకాల రిజిస్టర్లను, లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమం నిర్వహణ అధికారి డాక్టర్ సౌమ్య, డిప్యూటీ జిల్లా విస్తరణ మరియు మీడియా అధికారి బారె రవీందర్, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

సర్పంచ్ పెందోర్ ఆనందరావు



కెరమెరి, నవంబర్ 4 (జనంసాక్షి) విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణను అలవర్చుకుని లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సర్పంచ్ పెందోర్ ఆనందరావు అన్నారు. బుధవారం చింతకర్ర గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శ్రీ పెందోర్ శ్యాంరావు పటేల్ సేవా సమితి ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాల దశ నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే భవిష్యత్తు అద్భుతంగా ఉంటుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సూచనలను పాటిస్తూ విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుపైనే దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను, పాఠశాలల్లోని వనరులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చదువుతో పాటు సమాజం పట్ల బాధ్యత కలిగి ఉన్నప్పుడే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పెందోర్ శ్యాంరావు పటేల్ సేవా సమితి అధ్యక్షుడు పెందోర్ శ్రీనివాస్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మాకీ తుకారాం, సేవా సమితి సభ్యులు కంబాల వినేష్, అడ రాంచందర్, అడ ఆనంద్, ప్రకాష్ వసకే, గుణవంత్, ఉపాధ్యాయురాలు మహేశ్వరి, గ్రామస్థులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలి

టీఆర్పీ జిల్లా అధ్యక్షుడు మహేష్ వర్మ



బెల్లంపల్లి, నవంబర్ 4, (జనంసాక్షి) తెలంగాణ రాజ్యాధికార పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని టీఆర్పీ జిల్లా అధ్యక్షుడు మహేష్ వర్మ పిలుపునిచ్చారు. మంగళవారం బెల్లంపల్లి పట్టణంలో టీఆర్పీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న నాయకత్వంలో రాజ్యాధికార సాధనే లక్ష్యంగా పని చేయాలన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతతో పనిచేయాలని సూచించారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు నూతన కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువ కావాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, జిల్లా కమిటీ బలోపేతం, నూతన బాధ్యతలు చేపట్టిన నాయకులకు నియామక పత్రాల అందజేత వంటి అంశాలపై చర్చించారు. రాబోయే రాజ్యాధికార పాదయాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల్లో పార్టీ కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ నిర్మాణాన్ని క్షేత్రస్థాయి నుంచి పటిష్టం చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజల గొంతుకగా పార్టీ నిలవాలని పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్న నాయకత్వంలో బహుజనులకు రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, రాజ్యాధికార సాధన లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతుందని మహేష్ వర్మ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు వాసాల అనిల్, సత్రవేణి వెంకటేష్, బెల్లంపల్లి నియోజకవర్గ నాయకులు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇన్ఫంట్ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం



కౌటాల నవంబర్ 04 జనం సాక్షి మండలంలోని ఇన్ఫంట్ జీసస్ హై స్కూల్ లో బుధవారం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ టోనీ ఫాదర్, విద్యార్థుల విద్యాభివృద్ధి, క్రమశిక్షణ, బోధనా విధానాలపై తల్లిదండ్రులకు వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలని, పిల్లల భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దడంలో పాఠశాలతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు.అనంతరం తల్లిదండ్రులు అడిగిన వివిధ ప్రశ్నలకు ప్రిన్సిపాల్ సమాధానాలు ఇచ్చారు. విద్యార్థుల చదువు, పాఠశాల విధానాలపై తల్లిదండ్రులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసి వారిని సంతృప్తి పరిచారు.ఈ సమావేశం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయాన్ని పెంపొందించడంతో పాటు విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.తల్లి తండ్రుల రాకతో పాఠశాల సిబ్బంది,పిల్లలు ఎంతో సందడిగా పాఠశాల ను అలంకరించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టోనీతో శ్రీకాంత్, బ్రదర్ అమల్, సిబ్బంది, తల్లి తండ్రులు పాల్గొన్నారు.

రీ సర్వే, భూ క్రమబద్ధీకరణ పనులు వేగవంతం చేయాలి



రామకృష్ణాపూర్, నవంబర్ 04 (జనంసాక్షి): జిల్లాలో కొనసాగుతున్న భూముల రీ సర్వే, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అధికారులను ఆదేశించారు. బుధవారం మందమర్రి మండలంలో పర్యటించిన ఆయన క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న రీ సర్వే పనులను పరిశీలించారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రెవెన్యూ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు.

జిఎం కార్యాలయం ఎదుట ఏఐటియుసి ధర్నా



శ్రీరాంపూర్(జనంసాక్షి): ఏఐటియుసి ఆధ్వర్యంలో బుధవారం రోజున శ్రీరాంపూర్ జిఎం కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు.ముఖ్య అతిథులుగా డివ్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య,బ్రాంచ్ కార్యదర్శి ఎస్ కే బాజీ సైదా పాల్గొని మాట్లాడుతూ జూన్ 8వ తేదీన తాము సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని దానివలన యాజమాన్యం లేబర్ కమిషన్ సమక్షంలో డిమాండ్లపై ఆగష్టు 28న ఒప్పందం కుదిరిన వాటిని వెంటనే అమలు చేయాలని, ప్రధానంగా పెండింగ్ లో ఉన్న డిపెండెంట్ అభ్యర్థుల నియామక పత్రాలను వెంటనే అందించాలని, మెడికల్ బోర్డు ప్రతినెల నిర్వహిస్తామని ఒప్పందం చేసుకొని 3 నెలలు బోర్డు నిర్వహించి దానిని నిలిపివేశారని వెంటనే ప్రతి నెల మెడికల్ బోర్డును నిర్వహించాలని,మారుపేర్ల సమస్యల్లో పెండింగ్లో ఉన్న అర్హులైన అభ్యర్థులందరికీ ముఖ్యంగా 35 నుండి 45 సంవత్సరాల వయసు గల అభ్యర్థులకు వర్తించే నిబంధనలు ఒప్పందం ప్రకారం వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు, సొంత ఇంటి పథకాన్ని ఎటువంటి జాప్యం లేకుండా అమలు చేయాలని అలాగే రక్షణ పరికరాలు,యంత్రాలు,స్పేర్ పార్ట్స్,కార్మికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని బూట్లు,హెల్మెట్లు,బిట్లు,డ్రిల్ రాడ్లు తదితర అవసరమైన పరికరాలను తక్షణమే సరఫరా చేయాలని,అంతేకాకుండా జెన్కోట్రాన్స్కో నుండి సంస్థకు రావలసిన 59 వేల కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని తక్షణమే ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అనంతరం ఏరియా జిఎంకి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్,ఏరియా కార్యదర్శి సంపత్,జిల్లా కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్,గొరై నర్సయ్య,గండి సతీష్,సురేష్,ఫిట్ కార్యదర్శిలు గుణిగంటి నర్సింగారావు,సారయ్య,మోతే లచ్చన్న,నవీన్ రెడ్డి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్ రెన్యువల్ పై విశ్రాంత ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం



నస్పూర్(జనంసాక్షి):సింగరేణి విశ్రాంత ఉద్యోగులు,కోల్మైన్స్ పెన్షనర్ల సౌకర్యార్థం సీఎంపీఎఫ్ గోదావరిఖని రీజియన్ చేపట్టిన డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపెయిన్ 5.వ సీఎంపీఎఫ్ గోదావరిఖని రీజినల్ కమిషనర్ గోవర్ధన్ ఆధ్వర్యంలో ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా జిఎం కార్యాలయంలో బుధవారం ప్రారంభించారు.అన్ని గనులు,విభాగాల సంక్షేమ అధికారులు, సీఎంపీఎఫ్ డీలింగ్ స్టాఫ్ కు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ రెన్యువల్ పై అవగాహన కల్పించటంతో పాటు విశ్రాంత ఉద్యోగులకు నేరుగా లైఫ్ సర్టిఫికెట్ రెన్యువల్ చేసేలా ఏర్పాట్లు చేశారు.పెన్షనర్ల డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ ను ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కౌంటర్లో అప్పటికప్పుడు ఆన్లైన్లో రెన్యువల్ చేసి రెన్యువల్ కాపీని అందజేశారు.ప్రతీ సంవత్సరం నవంబర్ మాసంలో డీఎల్సీ రెన్యువల్ చేసుకోవటం ద్వారా ఎలాంటి ఆటంకాలు లేకుండా పెన్షన్ పొందవచ్చు అని సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ గోవర్ధన్ తెలిపారు. మొబైల్ ద్వారా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ పునరుద్ధరణపై రూపొందించిన వీడియోను ప్రదర్శించారు.సీఎంపీఎఫ్ అధికారులు కల్పించిన ఈ అవకాశాన్ని విశ్రాంత ఉద్యోగులు సద్వినియోగ పరుచుకోవాలని జీఎం శ్రీనివాస్ కోరారు.సుదీర్ఘ కాలం సింగరేణి సంస్థ అభ్యున్నతికి కృషిచేసిన విశ్రాంత ఉద్యోగుల సీఎంపిఎఫ్ పెన్షన్,సిపిఆర్ఎంఎస్ కార్డుల రెన్యువల్ ఇతర సేవల విషయంలో సంక్షేమ అధికారులు,సంబంధిత సిబ్బంది మానవతా దృక్పథంతో సహకరించాలన్నారు. సీఎంపీఎఫ్ అధికారులు రూపొందించిన వీడియో లింక్ను అన్ని గ్రూప్లలో షేర్ చేసి అవగాహన కల్పించాలని కోరారు. గురువారం సైతం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో అవగాహన కార్యక్రమం కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ బాజీ సైదా,డీజీఎం ఎస్ అనిల్ కుమార్,డీవై పీఎం క్రాంతి కుమార్ అన్ని గనుల సంక్షేమ అధికారులు, సీఎంపీఎఫ్ సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు,తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా గ్రామీణ రహదారులు.. నిత్యం ప్రమాదాల భయం!



కుబీర్, నవంబర్ 04, (జనంసాక్షి): కుబీర్ మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు గుంతలమయంగా మారి ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. రహదారులపై తారు పూర్తిగా దెబ్బతిని కంకర తేలడంతో పాటు అడుగడుగునా పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నిత్యం ప్రమాదాల భయంతో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా డోడర్న, కస్ర, సోనారి, బెల్గాం సరిహద్దు వరకు, రంజని తదితర గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయి.

అడుగడుగునా గుంతలు.. ప్రమాదాలకు నిలయాలు

రహదారులపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇచ్చే క్రమంలో గుంతలను తప్పించుకోలేక వాహనాలు అదుపుతప్పుతున్నాయి. వర్షాలు కురిసినప్పుడు గుంతల్లో నీరు చేరి వాటి లోతు తెలియక ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోంది. నిత్యం పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే రైతులు, వ్యవసాయ కూలీలు, చిరు వ్యాపారులు, విద్యార్థులు ఈ రహదారులపై ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్ల దుస్థితితో ద్విచక్ర వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని, అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. గర్భిణులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆసుపత్రులకు తరలించే సమయంలో రహదారులపై కుదుపులతో ఇబ్బందులు తప్పడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు సైతం వేగంగా వెళ్లలేని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూమిపూజకే పరిమితమైన రహదారి పనులు

ఇదిలా ఉండగా, కుబీర్ నుంచి డోడర్న వెళ్లే రహదారి మరమ్మతులు, ప్యాచ్‌వర్క్ పనుల కోసం ఇటీవల ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ భూమిపూజ నిర్వహించారు. దీంతో తమ రహదారి సమస్యకు పరిష్కారం లభిస్తుందని గ్రామస్తులు ఆశించారు. అయితే భూమిపూజ జరిగి రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. శంకుస్థాపన కార్యక్రమాలకే పరిమితం కాకుండా పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలు జరిగాక స్పందిస్తారా?

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రహదారులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే రహదారులను బాగు చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని అభిప్రాయపడుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి దెబ్బతిన్న రహదారులను పరిశీలించాలని, తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా నాణ్యతతో కూడిన శాశ్వత పనులు చేపట్టాలని కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించి రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పోటీ పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధమై లక్ష్యాన్ని సాధించాలి- కలెక్టర్ రాజర్షిషా



ఉట్నూర్ నవంబర్ 04 (జనం సాక్షి) గిరిజన యువత పట్టుదలతో చదివి పోలీసు ఉద్యోగాలను సాధించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు.బుధవారం రోజున గిరిజన సంక్షేమ శాఖ, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉట్నూర్‌లోని యూత్ ట్రైనింగ్ సెంటర్ లో పోలీస్ కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రిలిమినరీ పరీక్షల అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరాన్ని ప్రాజెక్టు అధికారి మంద మకరందు, ఉట్నూర్ సబ్ కలెక్టర్ ప్రణయ్‌తో కలిసి ఆయన ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి సరైన మార్గదర్శకత్వం, నిత్యం ప్రాక్టీస్ చేయడం ఎంతో కీలకమని తెలిపారు. అభ్యర్థులు తమ బలహీనతలను గుర్తించి, నిపుణుల సహాయంతో వాటిని అధిగమించాలని సూచించారు. డిసెంబర్ 20 నాటికి జరగబోయే పరీక్షలకు సమయం తక్కువగా ఉన్నందున, అభ్యర్థులు పరీక్షా విధానం, ప్రశ్నపత్రం సరళి, సిలబస్, మార్కుల విభజనపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. సమయపాలన పాటిస్తూ రోజువారీ చదువును ఎలా కొనసాగించాలి, గత ప్రశ్నపత్రాలను ఎలా సాధన చేయాలి అనే అంశాలపై విలువైన సూచనలు చేశారు. అభ్యర్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో చదివి లక్ష్యాన్ని సాధించాలని, అందుబాటులో ఉన్న శిక్షణా వనరులను సద్వినియోగం చేసుకొని గిరిజన యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు కలెక్టర్, ప్రాజెక్టు అధికారి, సబ్ కలెక్టర్ చేతుల మీదుగా నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. ఆ తర్వాత వైటీసీలోని కంప్యూటర్ ల్యాబ్‌లను కలెక్టర్ పరిశీలించి, విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాబ్స్ డిస్ట్రిక్ట్ మేనేజర్ నాగభూషణం, వైటీసీ సిబ్బంది, ఫ్యాకల్టీ కార్తీక్, అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ బ్యూరో నవంబర్ 04, (జనంసాక్షి) మాటేగాం గ్రామంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం భైంసా మండలం మాటేగాం గ్రామంలో కలెక్టర్ పర్యటించి, డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఇళ్లకు సంబంధించిన రికార్డులు, లబ్ధిదారుల వివరాలను పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులను గుర్తించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం భైంసా పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. స్థల విస్తీర్ణం, ఇతర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి, తదుపరి చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, తహసీల్దార్ శశిభూషణ్, ఎంపీడీవో నీరజ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



భీమిని నవంబర్ 4 జనం సాక్షి ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని భీమిని మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు, భోజన శాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, వంట శాల, భోజన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు .పైలెట్ ప్రాజెక్ట్‌లో ఎంపికైన మల్లిడి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, బోధనా తీరును పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మిస్తున్న వివో భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు మహిళా సంఘాల కార్యకలాపాలకు అవసరమైన వసతులు కల్పించేలా నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. తాసిల్దార్ కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేశారు భూ రీ సర్వే పనుల పరిశీలనను తహసిల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు కలెక్టర్ వెంట తహసిల్దార్ బికర్ణదాస్, కన్నెపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు అధికారులు పాల్గొన్నారు .

ఈ - హెచ్.ఆర్.ఎం.ఎస్. ఈ సాంక్షన్ పై జిల్లా అధికారులు అవగాహన కలిగి ఉండాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత





కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 04(జనంసాక్షి): రాష్ట్ర ఆర్థిక శాఖ నూతనంగా ప్రవేశపెట్టిన ఈ – హెచ్.ఆర్.ఎం.ఎస్. ఈ సాంక్షన్ లపై అన్ని శాఖల డి.డి.ఓ.లు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో అన్ని ప్రభుత్వ శాఖల డి.డి.ఓ. లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ నూతనంగా ప్రవేశపెట్టిన ఈ – హెచ్.ఆర్.ఎం.ఎస్., ఈ సాంక్షన్ విభాగాల ద్వారా కాగిత రహిత కార్యకలాపాలను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విభాగాల నిర్వహణపై అందిస్తున్న ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి అంశం పట్ల అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఈ నెల 5వ తేదీన మండల స్థాయి డి.డి.ఓ. లకు, 6న డి.డి.ఓ. అందరికీ అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖజానా శాఖ అధికారి హమీద్ షా ఖాన్, డి.డి.ఓ. లు పాల్గొన్నారు.

దోపిడీ అంతం కోసం అమరుల ఆశయబాటలో నడవాలి - పూనెం ప్రభాకర్



గంగారం నవంబర్ 4 (జనం సాక్షి) భారతదేశంలో పీడిత ప్రజలపై సాగుతున్న దోపిడీ, పీడన అణచివేతను అంతం చేయాలని విప్లవకారులు తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేశారని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ మహబూబాబాద్ డివిజన్ కార్యదర్శి పూనెం ప్రభాకర్‌అన్నారు. నవంబర్ 1 నుంచి 7 వరకు అమరవీరుల సంస్మరణసభల వారోత్సవాలలో సందర్భంగా నేడు మండల కేంద్రమైన గంగారం, కొడిసేలమీట్ట, పందెం, కోమట్లగూడెం, కాటినాగారం గ్రామాల వద్ద ఉన్న స్థూపాలపై జండా ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి, భుక్తి,దేశ విముక్తి లక్ష్యంగా సాగిన దీర్ఘకాలిక విప్లవోద్యమంలో వందల వేల మంది తమ సర్వస్వాన్ని త్యాగం చేసి ప్రజలకు అనేక విజయాలను సాధించి పెట్టారని అన్నారు. వారి ఆశయమైన దోపిడీ లేని వ్యవస్థ ఏర్పడలేదని అన్నారు. ఆ కర్తవ్యాన్ని నేటి యువత చేపట్టాలని పిలుపు నిచ్చారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అధికారం కోసం ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను అమలు చేయలేక, ప్రశ్నించే వారిపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని వేదనతో అన్నారు. ఏజెన్సీ ప్రాంత ప్రజల హక్కులైన సంపద వనరులను ఆ ప్రజలకు కాకుండా పెట్టుబడిదారులకు దోచిపెడుతున్న విధానాలపై పోరాడాలని అన్నారు. నిరుద్యోగం పేదరికం వలసలు ఆకలి చావులు ఇంకా అనేక సామాజిక రుగ్మతలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయని అన్నారు. పెట్టుబడిదారీ అనుకూల విధానాలను అమలు చేస్తున్న ప్రభుత్వాలు పేదలను మరింత పేదలుగా మార్చుకున్నారని అన్నారు.ఐక్య సమరశీల వర్గ పోరాటాల ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయటం కోసం అమరుల ఆశయబాటలో నడవాలని అన్నారు. అమర వీరులను స్మరించుకుంటూ గ్రామ గ్రామాలలో సభలు సమావేశాలునిర్వహిస్తున్నామని తెలిపారు . ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ నాయకులు ఈక బిక్షం, మండల నాయకులు కురుసం రంగయ్య, జోగ రాములు, కురుసం సురేష్ పూణ్యం రవికుమార్ నాగేశ్వరరావు వీరస్వామి వెంకన్న అరుణ లక్ష్మి రామక్క పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో బియ్యం దుకాణాలు, రిటైల్ స్టోర్‌పై సంయుక్త తనిఖీలు



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 04(జనంసాక్షి): కాగజ్‌నగర్ గోల్ బజార్‌లో పౌరసరఫరాల శాఖ, లీగల్ మెట్రాలజీ శాఖ, మున్సిపల్ శాఖ అధికారులు సంయుక్తంగా బియ్యం దుకాణాలపై తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో కొన్ని దుకాణాల్లో 26 కిలోలుగా ముద్రించిన బియ్యం బస్తాల్లో 25 కిలోల బియ్యం మాత్రమే ఉన్నట్లు, తూనికలు, కొలతలు మరియు లైసెన్సులకు సంబంధించిన నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారు. ఈ నేపథ్యంలో సతీష్ కిరాణా, వైద్య రవికుమార్ కిరాణా, బుక్క రాములు కిరాణా, పండరినాథ్ దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా, కాగజ్‌నగర్‌లోని రిలయన్స్ స్మార్ట్ పాయింట్‌లో కూడా తనిఖీలు నిర్వహించగా, తూనిక యంత్రంలో (కాంటా) వ్యత్యాసాలు గుర్తించినట్లు, ఈ మేరకు లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను బియ్యం దుకాణాల యజమానులు మరియు వ్యాపార సంస్థలు తప్పనిసరిగా పాటిస్తూ వినియోగదారులకు సహకరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో డీసీఎస్ఓ వాజిద్ అలీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌కుమార్, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ అజీజ్ పాషా మరియు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



బురాన్ పల్లిలో కాంగ్రెస్‌లోకి 20 కుటుంబాలు



రాయపర్తి,నవంబర్ 04 (జనంసాక్షి): రాయపర్తి మండలం బురాన్ పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు 20 కుటుంబాలు సర్పంచ్ సూదుల ఉమాదేవి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా నిత్యవసర సరుకులు అందచేయాలి



పాలకుర్తి, నవంబరు 04(జనంసాక్షి) ఎల్నినో ప్రభావంతో కరువు తాండవిస్తోన్న సందర్భంగా పేదలకు ఉచితంగా నిత్యవసర సరకులు పంపిణీ చేయాలని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రదానకార్యదర్శి సింగారపు రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని మంచుప్పల గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం జరుగగా ముఖ్యఅతిథిగా రమేష్ మాట్లాడారు. కరువు పరిస్థితుల దృష్ట్యా వీబీజీరాంజీ పథకం ద్వారా కూలీలందరికి 200 రోజులు పని దినాలు కల్పించి, రోజుకు రూ.800 చొప్పున కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాబ్ కార్డు లేని పేదలందరికి జాబ్ కార్డు ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ అత్మీయ భరోసా పథకం కింద ఏడాదికి రూ.12 వేల ఇస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్యాల సోమన్న, సోమ సత్యం, కాకర్ల పద్మ, బాబు, వెన్నెల, రేణుక, దయాకర్, సోమన్న, బిక్షం. ఐలయ్య, మైసమ్మ పాల్గొన్నారు.

సింగరేణి పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి: ఏఐటీయూసీ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): భూపాలపల్లి జీఎం కార్యాలయం ముందు ఏఐటీయూసీ ధర్నా నిర్వహించింది. ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.59 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని, డిపెండెంట్ ఉద్యోగాలు, సొంతింటి పథకం, రక్షణ పరికరాలు, మారుపేర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బ్రాంచ్ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఎస్సై దాసరి సుధాకర్

రేగొండ,నవంబర్ 04(జనం సాక్షి): సైబర్ నేరాలు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రేగొండ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం పోలీస్ స్టేషన్ ఆవరణంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సుధాకర్ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు నకిలీ లింకులు, ఫేక్ కాల్స్, ఉద్యోగాల పేరుతో, పెట్టుబడులపై అధిక లాభాల ఆశ చూపుతూ ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, వాట్సాప్ లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరికీ ఓటీపీ, పిన్ నంబర్లు, బ్యాంకు ఖాతా వివరాలు వెల్లడించవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆగండి.. ఆలోచించండి.. ధృవీకరించండి అనే సూత్రాన్ని పాటించాలని, ఏదైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. సైబర్ నేరాల నివారణ పోలీసులతో పాటు ప్రజలందరి బాధ్యత అని కుటుంబ సభ్యులు, స్నేహితులు, విద్యార్థులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేగొండ పోలీసులు లింగమూర్తి, పృధ్వి, కిరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకు గుర్తింపుగా అమ్మ అశోకు ఘన సన్మానం



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 4 (జనం సాక్షి) :హనుమకొండలోని హోటల్ విహార గ్రాండ్‌లో 41 బీసీ కులాల ఆత్మగౌరవ భవనాల పరిరక్షణకు సంబంధించి జీవో నంబర్ 14 విడుదల కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ నిర్వహించిన బీసీ కులాల సమావేశంలో అమ్మ అశోక్ ను ఘనంగా సన్మానించడం జరిగింది.నిరంతరం ప్రజాసేవలో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఇప్పటివరకు 54 సార్లు రక్తదానం చేసినందుకు అతడి సేవలను గుర్తించి సన్మానించడం జరిగింది. అనంతరం అమ్మ అశోక్ మాట్లాడుతూ ఈ సన్మానం అందించడం ఎంతో ఆనందంగా ఉంది. అని హర్షం వ్యక్తం చేశారుఈ సందర్భంగా వరంగల్ జిల్లా అధ్యక్షులు బెల్లం బాలరాజు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కంచ ప్రభాకర్ పోతరాజు రమేష్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ప్రభుత్వం ఉద్యమ కారుని కుటుంబాన్ని ఆదుకోవాలి - బిజెపి



బచ్చన్నపేట (జనం సాక్షి) తెలంగాణ ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబాన్ని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు సొడ రమేష్ అన్నారు. బచ్చన్నపేట మండలంలోని కొన్నే గ్రామంలో తెలంగాణ ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ ఆత్మహత్య చేసుకోగా బుధవారం ఆ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం రమేష్ మాట్లాడుతూ ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్, ఆర్థిక పరిస్థితుల ద్వారా చనిపోవడం జరిగిందని తెలంగాణ వస్తే తమ బతుకులు మారుతాయని భావించి వేముల లక్ష్మణ్ గౌడ్ ఉద్యమంలోకి అడుగు పెట్టాడు. ఎన్నో పోరాటాలు ఎన్నో జైళ్ళ నిర్బంధాలు మధ్య కూడా తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొనడం జరిగిందని అన్నారు. ఉద్యమం సమయంలో పోలీస్ స్టేషన్లలో నిద్రపోయిన వ్యక్తి లక్ష్మణ్ గౌడ్ ఉద్యమ సమయంలో ఎన్ని కేసులు పెట్టిన భయపడకుండా ఉద్యమం చేసిన వ్యక్తి లక్ష్మణ్. తెలంగాణ వస్తే బతుకులు మారుతాయి అని అనుకున్నారు కానీ. తెలంగాణ వచ్చినంక 10 సంవత్సరాలు పరిపాలించిన బిఆర్ఎస్ ఏ ఒక్కరోజు కూడా తెలంగాణ ఉద్యమకారులను పట్టించుకోలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వేముల లక్ష్మణ్ లాంటి ఎంతో ఎంతోమంది కుటుంబాలను పట్టించుకోకుండా గద్దెనెక్కిన బిఆర్ఎస్ నాయకులు ఆస్తులు సంపాదించుకున్నారు తప్ప ఉద్యమకారులకు ఏం చేయలేదు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చినటువంటి ఉద్యమకారులకు ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తానని చెప్పి ఇంతవరకు ఏమి చేయలేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా వెంటనే ప్రభుత్వం స్పందించి ఇచ్చినటువంటి హామీని 250 గజాల ఇంటి స్థలం. మరియు వేముల లక్ష్మణ్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని అన్నారు. కల్వకుంట్ల కుటుంబం ఉద్యమకారుల బతుకుల మీద ఏర్పడ్డ కుటుంబం. ఉద్యమకారుల ద్వారా గద్దెనెక్కి కోట్లు కోట్లు సంపాదించుకోవడం సిగ్గుచేటు అని అన్నారు. అలాగే వేముల లక్ష్మణ్ కుమార్ జనగామ జిల్లా కోసం కూడా ఉద్యమాలు చేశాడని గుర్తు చేసుకున్నారు. ఎన్నోసార్లు కలిసి తెలంగాణ ఉద్యమ సమయంలో కానీ జిల్లా ఉద్యమంలో సమయంలో గానీ కలిసి పని చేశామని ఆయన అన్నారు. ఇలాంటి వ్యక్తి మమ్మల్ని విడిచి వెళ్లిపోవడం చాలా బాధాకరమని అన్నారు.వెంటనే ఇప్పుడున్న ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్, కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు బంగారు మహేష్, జిల్లా నాయకులు బల్ల శ్రీనివాస్. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గద్దరాజు, డాక్టర్ వెంకటేష్ , వేముల సందీప్, తుడుములోని సంపత్, నవీన్ కుమార్, భరత్, మరియు జిల్లా నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య



ఎల్కతుర్తి భీమదేవరపల్లి నవంబర్ 4 జనం సాక్షి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య జిల్లాలోని వంగర, ముల్కనూర్ ఎల్కతుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని ఫార్మసీ (మందుల నిల్వలు), ల్యాబొరేటరీ రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. మందుల నిల్వలు, పంపిణీ వివరాలు, ప్రయోగశాల పరీక్షల రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అనే అంశాలను తనిఖీ చేసి, రికార్డుల నిర్వహణలో ఎలాటి నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును సమీక్షించారు. ముఖ్యంగా మాతా శిశు ఆరోగ్య సేవలు ఏం సి హెచ్ లో సాధారణ టీకాల కార్యక్రమం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. అలాగే నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ ఎన్ సి డి కార్యక్రమంలో భాగంగా ప్రజలకు విస్తృతంగా స్క్రీనింగ్ నిర్వహించి, వ్యాధులు గుర్తించిన వారికి సకాలంలో చికిత్స అందిస్తూ నిరంతర ఫాలోఅప్ చేయాలని సూచించారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులను ముందుగానే గుర్తించి, వారికి తగిన చికిత్స అందించాలని తెలిపారు. కీటక జనిత వ్యాధులైన డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధుల నియంత్రణకు పారిశుద్ధ్య కార్యక్రమాలు, దోమల నివారణ చర్యలు, యాంటీ లార్వా ఆపరేషన్లు ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సమస్వయంతో పనిచేస్తూ అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య సూచించారు. ఇట్టి కార్యక్రమంలో వంగర వైద్యాధికారులు డాక్టర్ రహమాన్, డాక్టర్ రూబీన, ముల్కనూరు వైద్యాధికారి డాక్టర్ ముజీబు , వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలపై ర్యాలీ



ఏటూరునాగారం, నవంబర్ 04(జనంసాక్షి). తెలంగాణ రాష్ట్రం అంతట నిర్వహిస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరావాదిక సమ్మెలో భాగంగా 23 రోజున ఏటూరు నాగారం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు .ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు తెలంగాణ రాష్ట్ర మంతట 17వేల మంది జాతీయ ఆరోగ్య మిషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగులందరూ అక్టోబర్ 13 నుంచి ఇప్పటివరకు నిరవధిక సమ్మె సమస్యల పరిష్కారానికై పోరాడుతూ ర్యాలీలు సమ్మెలు నిర్వహిస్తున్నారు అదేవిధంగా ఏటూరు నాగారం ఏరియా ఆసుపత్రిలో ఎన్ హెచ్ ఎం లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరూ సమ్మెలో పాల్గొని ర్యాలీ నిర్వహించారు.

వీరి డిమాండ్లు:

1. ఉద్యోగ భద్రత సమాన పనికి సమాన వేతనం.
2. మహిళలకు 180 రోజులు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఏర్పాటు
3. 60 జీవోను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు.
4. ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు
5. అన్ని క్యాడర్ల ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి.

లేని పక్షంలో పెద్ద ఎత్తున ఎన్హెచ్ఎంలో పనిచేస్తున్న 17వేల మంది ఉద్యోగులు రోడ్డుపై రావాల్సిన పరిస్థితి కనబడుతుందని వెంటనే ప్రభుత్వం మా డిమాండ్లను పరిష్కరించి మా సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంగా భవాని, సౌజన్య, స్రవంతి, మౌనిక, సంధ్య, సత్యవతి, కౌసల్య, నిర్మల, సుమలత, బతుకమ్మ, యశోద, మురళి, దేవరాజ్, వెంకట్, రాజేష్, కృష్ణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైబర్ నేరాల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పోలీస్ స్టేషన్లో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన స్థానిక ఎస్సై నరసింహారావు



ఎల్కతుర్తి నవంబర్ 4 జనం సాక్షి బుధవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని శాంతినగర్ సెంటాన్ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) నరసింహారావు పోలీస్ స్టేషన్ పనితీరు, పోలీసుల విధులు, చట్టాలు, సామాజిక సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ నరసింహారావు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, సంఘటనకు సంబంధించిన పూర్వాపరాలను తెలుసుకున్న తర్వాత కేసు స్వభావాన్ని బట్టి తగిన సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేస్తామని వివరించారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ విధులు, ఇతర పోలీస్ సిబ్బంది బాధ్యతలు, ఫిర్యాదుల స్వీకరణ, కేసుల విచారణ తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలు, ఎస్ఐ కార్యాలయం, మహిళా విభాగం తదితర గదుల పనితీరును విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపిస్తూ వాటి విధుల గురించి తెలియజేశారు. ముఖ్యంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, తెలిసీ తెలియని వయసులో చెడు అలవాట్లకు బానిస కావద్దని సూచించారు. ఎక్కడైనా గంజాయి విక్రయాలు, వినియోగం లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినా వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సెల్‌ఫోన్లు, సోషల్ మీడియా వినియోగంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత ఫొటోలు, డీపీలు, ఇతర సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు పోలీస్ అధికారులను చూసి భయపడాల్సిన అవసరం లేదని, పోలీసులు ప్రజల రక్షణ కోసమే పనిచేస్తారని ఒక తండ్రిలా ఆప్యాయంగా వివరిస్తూ వారిలో ధైర్యం, చట్టాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పోలీస్ వ్యవస్థ పనితీరు, చట్టాలపై అవగాహనతో పాటు మత్తు పదార్థాల నివారణ, సైబర్ భద్రత, సామాజిక బాధ్యతలపై విలువైన సూచనలు అందించారు ఈకార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ తులసి ఉపాధ్యాయులు శ్రీనివాస్ పోలీసులు హెడ్ కానిస్టేబుల్ విఠల్ రావు హెడ్ కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి ఉమెన్ కానిస్టేబుల్ సుప్రియ ఉమెన్ కానిస్టేబుల్ మోనికా ఉమెన్ కానిస్టేబుల్ దివ్య .భగవాన్. అగ్గర్ తదితరులు పాల్గొన్నారు

నార్లాపూర్ పోలీస్ స్టేషన్‌లోని ఈ కంపెనీపై కమాండెంట్ వార్షిక తనిఖీ



గోవిందరావుపేట: నవంబర్04(జనం సాక్షి) 5వ బెటాలియన్ టీజీఎస్పీకి చెందిన నార్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఈ కంపెనీని బెటాలియన్ కమాండెంట్ సి.వి. లక్ష్మీకాంత రావు గారు వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ సిబ్బంది నిర్వహిస్తున్న విధులు, రికార్డుల నిర్వహణ, ఆయుధాలు, పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిబ్బందికి కల్పిస్తున్న వసతులు తదితర అంశాలను పరిశీలించారు. సిబ్బంది యొక్క పరేడ్, క్రమశిక్షణ, విధి నిర్వహణ తీరును సమీక్షించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు, సంక్షేమ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ, క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువచ్చేలా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

యూజీడీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

కేంద్ర అదనపు కార్యదర్శి తారా

నగర ఆదాయ వనరులపై వివరాలు వెల్లడించిన కమిషనర్ వెంకన్న



వరంగల్, నవంబర్ 04 (జనం సాక్షి) :- నగరంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు ఆమోదం లభించిన నేపథ్యంలో ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక అంశాలపై కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి డి. తారా బుధవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో బల్దియా కమిషనర్ టి. వెంకన్న క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. యూజీడీ ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ సాంకేతిక అంశాలను సమీక్షించిన అదనపు కార్యదర్శి తదుపరి కార్యాచరణపై పలు సూచనలు చేశారు. అదేవిధంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయ వనరులు, సొంత ఆదాయాన్ని పెంచుకునేందుకు ఉన్న అవకాశాలపై కమిషనర్ ను వివరాలు కోరారు. దీనిపై కమిషనర్ ప్రస్తుతం కార్పొరేషన్ కు సమకూరుతున్న ఆదాయ మార్గాలతో పాటు అదనపు ఆదాయ సమీకరణకు చేపట్టదగిన చర్యలను వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, పబ్లిక్ హెల్త్ డీఈ కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

ఎంపీడీఓ ప్రవీణ్ కు వినతిపత్రం అందించిన ఏ ఎన్ ఎస్ నాయకులు

ఎల్ టి ఆర్ కేసులు ఉన్న నిర్మాణాల నుండి ఇంటి పన్నులు వసూలు చేస్తున్న పంచాయతీ అధికారులు



నూగూర్ వెంకటాపురం నవంబర్ 04(జనం సాక్షి):- ఎల్ టి ఆర్ చట్టం అమల్లో వెంకటాపురం మండల కేంద్రంలో ఎటువంటి చట్టపరమైన నిబంధనలు పాటించడం లేదు. గ్రామపంచాయతీ అనుమతులు లేని అక్రమ నిర్మాణాలను గుర్తించి నిలుపుదల చేయాలనీ ఎంపీడీఓ ప్రవీణ్‌కు ఆదివాసీ నవనిర్మాణ సేన నాయకులు కుంజ మహేష్, వాసం నారాయణ, కంతి శంకర్ వినతిపత్రం బుధవారం ఇచ్చారు. వలస గిరిజనేతరులు స్థానిక గ్రామపంచాయతీ నుండి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా, ఎల్ టి ఆర్ చట్టాన్ని ఉల్లంఘించి గతంలో చేసిన, ప్రస్తుతం చేస్తున్న నిర్మాణాల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నట్టు జిల్లా కన్వీనర్ కుంజ మహేష్,ఏ ఎన్ ఎస్ మండల అధ్యక్షులు వాసం నారాయణ తెలిపారు.

అధికారుల పర్యవేక్షణ శూన్యం..!

గతంలో ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి అక్రమ నిర్మాణాల పైన 63 ఎల్ టి ఆర్ కేసులు ఫైల్ చేసినట్టు ఎంపీడీఓ కు తెలిపారు. ఇప్పుడు ఎల్ ఆర్ కేసులు ఉన్న నిర్మాణాల నుండి పంచాయతీ అధికారులు ఇంటి పన్నులు, కమర్షియల్ పన్నులు కట్టిస్తున్నారని ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు కోర్టు దిక్కరణకు పాల్పడుతున్నట్టు వినతిపత్రం లో పేర్కొన్నట్టు వారు వివరించారు. రాజ్యాంగ బద్ధమైన ఎల్ టి ఆర్ చట్టాలను అధికారులు ఉల్లంఘించడం సరికాదన్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తూ ఉంటే పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారని అన్నారు. విధుల నిర్వహణలో పంచాయతీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నట్టు ఎంపీడీఓ కు తెలిపారు . పంచాయతీ అధికారులు ఎక్కడ విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదన్నారు. పెసా గ్రామసభలు పెట్టడంలో పంచాయతీ అధికారులు అలసత్వం వహిస్తున్నట్టు తెలిపారు. అభివృద్ధి పనులు చేపట్టే ముందు పెసా గ్రామసభలు పెట్టడం తప్పనిసరి అన్నారు. పెసా గ్రామసభలు పెట్టని గ్రామపంచాయతీలపై కోర్టులో కేసువేయనున్నట్టు వారు తెలిపారు.. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కంతి శంకర్ పాల్గొన్నారు.

ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త

చాగంటి కోటేశ్వరరావుని కలిసిన దాస్యం వినయ్ భాస్కర్



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 4 (జనం సాక్షి) :హనుమకొండ నగరానికి విచ్చేసిన ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, వేద పండితులు, ధార్మిక చింతనాపరులు చాగంటి కోటేశ్వరరావుని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందిఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు తో ఆధ్యాత్మిక, ధార్మిక అంశాలపై ఆత్మీయంగా ముచ్చటించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, సనాతన ధర్మం, ఆధ్యాత్మిక విలువలను ప్రజల్లోకి తీసుకెళ్తూ తన ప్రవచనాల ద్వారా సమాజానికి మార్గదర్శనం చేస్తున్న చాగంటి కోటేశ్వరరావు సేవలను దాస్యం వినయ్ భాస్కర్ కొనియాడారు.ఆధ్యాత్మికతతో సమాజంలో నైతిక విలువలు, మానవీయత, ధర్మబద్ధమైన జీవన విధానం పెంపొందించేందుకు చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు ఎంతగానో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు.

రంగశాయిపేటలో నరకాసుర వధ ఉత్సవాలకు భూమి పూజ

శుక్రవారం సాయంత్రం 6 గంటలకు నరకాసుర వధ కార్యక్రమం - అధిక సంఖ్యలో పాల్గొనాలని కమిటీ విజ్ఞప్తి



వరంగల్ ఎంజీఎం, నవంబర్ 4 (జనంసాక్షి): రంగసాయిపేటలోని మహంకాళి దేవాలయ ఆవరణంలో నరకాసుర వధ ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన పనులను ఈరోజు ఉదయం నరకాసుర ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు శెంకేషి వెంకటేశ్వర్లు, అధ్యక్షులు పూసల కిరణ్ కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు శెంకేషి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, నరకాసుర వధ ఉత్సవాన్ని విజయవంతం చేయడానికి కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రంగశాయిపేట ప్రజలు, యువకులు, మహిళలు, భక్తులు శుక్రవారం సాయంత్రం 6 గంటలకు జరిగే నరకాసుర వధ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. నరక చతుర్దశి సందర్భంగా నిర్వహించే నరకాసుర వధ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, చెడును అంతం చేసి ధర్మాన్ని కాపాడాలనే సందేశాన్ని ఈ ఉత్సవం ప్రజలకు తెలియజేస్తుందని అన్నారు. నరక చతుర్దశిని చిన్న దీపావళిగా కూడా పిలుస్తారని, ఈ పండుగ ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నరకాసుర ఉత్సవ కమిటీ కోశాధికారి కెశేచ నరేష్ ,ఉపాధ్యక్షులు బక్కి వంశీ, సలహాదారులు శెంకేషి సుధాకర్, కార్యనిర్వాహక కార్యదర్శి పాలకుర్తి సుమన్, చిగిరి పూర్ణ, ముత్తినేని సర్వేశ్వర్, శెంకేషి అనిల్ కుమార్, కేడల నరేష్ పాల్గొన్నారు.

గంజాయి తీసుకున్న వ్యక్తులను డి-అడిక్షన్ సెంటర్‌కి తరలింపు



పాలకుర్తి, నవంబర్ 04 (జనంసాక్షి)జనగామ జిల్లా, పాలకుర్తి మండలం, వల్మిడి గ్రామానికి చెందిన సొహైల్, పాలకుర్తి పట్టణ కేంద్రానికి చెందిన కౌశిక్‌కి గంజాయి టెస్ట్ పాజిటివ్ రావడంతో మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి 15రోజులు జనగాం డి-అడిక్షన్ సెంటర్‌కి పంపడం జరిగిందని, పాలకుర్తి ఎస్ఐ సృజన్ కుమార్ తెలిపారు, బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎవరైన చెడు వ్యసనాలకు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటమన్నారు. ఇప్పటి నుంచైనా ఎవరికైనా గంజాయి అలవాటు ఉంటె మానుకోవాలని హెచ్చరించారు.మత్తు పదార్థాలు సేవిస్తున్న, విక్రయిస్తున్న, చట్ట వ్యతిరేక కార్యక్ర మాలకు పాల్పడినట్లయితే వారి వివరాలు తెలిసిన వారు ప్రత్యక్షంగా లేదా ఫోన్ ద్వారానైనా పోలీసులను సంప్రదించవచ్చని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. గంజాయి పై ఉక్కు పాదం మోపుతామని, ఎవరైన చెడు వ్యసనాలకు పాల్పడితే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మేక బాబురావు దేవేందర్
జ్ఞాపకార్థం మాదారం తప్పెట కళాకారులకు విరాళం



పరకాల,నవంబర్ 04, (జనంసాక్షి):మేక బాబురావు అలియాస్ దేవేందర్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మాదారం తప్పెట కళాకారులకు విరాళం అందజేయడం జరిగింది.దివంగత బాబురావు భార్య వెంకటలక్ష్మి, కూతుర్లు కీర్తిశేషులు రాజేందర్ – సరిత, రెండవ కూతురు సౌజన్య – సుజన్ కుమార్, మూడవ కూతురు ప్రతిభ – సూర్య ఆధ్వర్యంలో ఈ దానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి సహకరించిన మేక రవీందర్ అన్న, వారికి సహకరించిన బంధుమిత్రులకు మాదారం తప్పెట కళాబృందం తరపున, కళాకారుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాదారం తప్పెట కుల పెద్ద మనుషులు సదయ్య, కోకిల స్వామి, చెరుకు వేణు, దుప్పటి రవి, మంద రాజయ్య, చెరుకు రాజేష్, దుప్పటి కళింగ రాజు, దుప్పటి ఉమేష్, దుప్పటి అశోక్, పసుల కిరణ్ మరియు సీతారాంపురం గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేయాలని మాదారం డప్పు కళాకారులు కోరారు.

గ్రాడ్యుయేట్ల భవిష్యత్తు కోసం కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి
కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి



శాయంపేట, నవంబర్ 4 (జనం సాక్షి) గ్రాడ్యుయేట్‌ల భవిష్యత్తు కోసం పట్ట భద్రులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. ఈ మేరకు వరంగల్ – ఖమ్మం – నల్గొండ గ్రాడ్యుయేట్ ఎన్నికల కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డికి మద్దతుగా మండలంలోని మందారిపేట లో బుధవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పట్టభద్రులను కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి సంబంధించిన వివరాలను తెలియజేస్తూ, ప్రభుత్వ పథకాలను వివరించారు. అలాగే పట్టభద్రుల సమస్యలు, వారి ఆకాంక్షలను చట్టసభల్లో సర్వోత్తం రెడ్డి ప్రస్తావిస్తారని అన్నారు. అదేవిధంగా ఇంకా ఎవరైనా ఓటు నమోదు చేసుకోని పట్టభద్రులు వెంటనే నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారపెల్లి రవీందర్, చిందం రవి, నిమ్మల రమేష్, కుక్కల తిరుపతి, రావుల శ్రీనివాస్, కొమ్ముల భాస్కర్, పైడి, తక్కల్ల సాంబయ్య, కొమ్ముల విష్ణు, బడుగు అశోక్, తదితరులు పాల్గొన్నారు .

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం :ఎమ్మెల్యే నాయిని
47, 62వ డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
శిలాఫలకాలకే పరిమితం కాకుండా 98 శాతం పనులు పూర్తి చేశాం



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 4 (జనం సాక్షి) :వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కాజీపేట ప్రాంత అభివృద్ధికి ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం కాజీపేటలోని 47, 62వ డివిజన్ల పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీల్లో రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు.అనంతరం మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, ఎస్సీ కాలనీలు, మురికివాడలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కేవలం జీవోలు తీసుకురావడం, కొబ్బరికాయలు కొట్టి శిలాఫలకాలు ఏర్పాటు చేయడమే అభివృద్ధి కాదని, ప్రారంభించిన పనులను పూర్తి చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. తమ పరిధిలో చేపట్టిన పనుల్లో సుమారు 98 శాతం పూర్తి చేశామని, మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేస్తున్నామని వెల్లడించారు.కాజీపేటలో గతంలో రోడ్ల పరిస్థితి, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు స్వయంగా గమనించాలని అన్నారు. సోమిడి నుంచి కాజీపేట పోలీస్ స్టేషన్ వరకు రహదారి అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. 47వ డివిజన్ ఎస్సీ కాలనీలో మిగిలిన రోడ్ల పనులకు సుమారు రూ.50 నుంచి రూ.60 లక్షల వరకు టెండర్లు పూర్తయ్యాయని, మరో వారం నుంచి పది రోజుల్లో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.కాజీపేట బస్టాండ్ నిర్మాణానికి అవసరమైన స్థలంపై గతంలోనే జిల్లా కలెక్టర్‌కు సమగ్ర విచారణ జరిపి, భూమికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించాలని వినతిపత్రం అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.వైఎస్సార్ నగర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లోని భూములపై కూడా పూర్తి స్థాయి విచారణ జరిపించాలని కలెక్టర్‌కు లేఖలు ఇచ్చినట్లు తెలిపారు. కాజీపేట చౌరస్తాలో కాంప్లెక్స్‌కు సంబంధించి 2020లో అప్పటి పాలకులు అనుమతుల మంజూరులో నిబంధనలు ఉల్లంఘించారా లేదా అనే విషయంపై విచారణ జరిపించాలని కోరినట్లు చెప్పారు. 2026లో జారీ అయిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌తో పాటు భవన వినియోగ అనుమతుల విషయంలోనూ స్పష్టత ఇవ్వాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు మరోసారి లేఖ రాసినట్లు వెల్లడించారు. పేదల ఇళ్ల అంశాన్ని రాజకీయాలకు వాడుకోవడం సరికాదని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఈ-హెచ్ఆర్ఎంఎస్ విధానంపై అవగాహన శిక్షణ కార్యక్రమం





ములుగు ప్రతినిధి, నవంబర్ 04(జనంసాక్షి). ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు రికార్డులు, వ్యక్తిగత వివరాలు, సేవా సంబంధిత కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన ఈ-హెచ్ఆర్ఎంఎస్ విధానంపై బుధవారం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ సంచాలకులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. ప్రస్తుతం అమలులో ఉన్న హెచ్ఆర్ఎంఎస్ విధానం స్థానంలో ప్రవేశపెడుతున్న నూతన ఈ-హెచ్ఆర్ఎంఎస్ విధానానికి మార్పు, సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగుల వ్యక్తిగత, సర్వీసు వివరాల నమోదు, వివిధ పరిపాలనా ప్రక్రియలు, సాఫ్ట్‌వేర్ వినియోగ విధానం, అందుబాటులో ఉండే సదుపాయాలపై అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి డిటిఓ సయ్యద్ ఖాలీద్ హుస్సేన్, పిఏఓ తులసి దాస్, ఉప కోశాధికారి ప్రకాశ్ రెడ్డి నాయకత్వం వహించి, నూతన విధానం అమలుకు సంబంధించిన అంశాలను వివరించారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డీడీఓలు), వారి కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఈ-హెచ్ఆర్ఎంఎస్ విధానాన్ని అన్ని శాఖల్లో సమర్థవంతంగా అమలు చేసేందుకు అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. నూతన విధానం ద్వారా ఉద్యోగుల సర్వీసు సంబంధిత కార్యకలాపాలను వేగవంతంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలవుతుందని అధికారులు పేర్కొన్నారు.

ఆసిఫాబాద్‌లో ఘనంగా కుమురం భీం స్మారక జెండా ఆవిష్కరణ
కుమురం భీం ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క



ఆసిఫాబాద్ , నవంబర్ 4 (జనం సాక్షి) జిల్లా రాజ్ గోండ్ సేవా సమితి ఆధ్వర్యంలో కుమురం భీం స్మారక జెండా ఆవిష్కరణతో పాటు వర్ధంతి వారోత్సవాలను బుధవారం ఆసిఫాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు కుమురం భీం స్మారక జెండా ఆవిష్కరణలో పాల్గొని , ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన గొప్ప యోధుడు కుమురం భీం అని ఆత్రం సుగుణక్క కొనియాడారు.ఆయన పోరాట స్ఫూర్తి, త్యాగాలు భావితరాలకు ఆదర్శమని, కుమురం భీం ఆశయాల సాధనతో పాటు ఆదివాసీల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందనీ,ఆయన చూపిన పోరాట బాటలో ప్రతి ఒక్కరూ నడవాలనీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు,అంకుసాపూర్ సర్పంచ్ టెకం గంగారాం, వగుదాం సర్పంచ్ జూగాదిరావ్,సమేలా సర్పంచ్ సంతోష్,మాజీ ఎంపీపీ మోతిరం,డీసీసీ కార్యవర్గం సభ్యుడు పేందూర్ సుధాకర్, శిడం అర్జు, మాడవి రగునాథ్, గురనులే నారాయణ, ఉప్పుల కృష్ణ, బాజీరావు,మారుతీ, చందన్ శావ్,జిల్లా రాజ్ గోండ్ సేవా సమితి నాయకులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ విక్రమ్ ఆశయాలను కొనసాగించాలి

కామ్రేడ్ పెనుక వెంకన్న (విక్రమ్)చిరస్మరణీయుడు

సీపీఐ (యం-యల్) న్యూడెమోక్రసీ జిల్లా, డివిజన్ నాయకులు అలకుంట్ల సాయిలు,జోగ రణధీర్



గూడూరు,నవంబర్04(జనంసాక్షి): కామ్రేడ్ విక్రమ్ ఆశయాలను కొనసాగించాలని సిపిఐ(ఎం ఎల్)న్యూ డెమోక్రసి జిల్లా, డివిజన్ అలకుంట్ల సాయిలు, జోగ రణధీర్ పిలుపునిచ్చారు. బుధవారం గూడూరు మండలం జగన్నాయకుల గూడెంలో పి. జనార్దన్ అధ్యక్ష తన స్మారక సభ నిర్వహించారు. గూడూరు మండలం, జగన్నాయలగూడెం గ్రామంలో జన్మించిన .సీపీఐ (ఎం -యల్) న్యూడెమోక్రసీ(ఆర్ సీ)జిల్లా నాయకులు కామ్రేడ్ విక్రమ్ స్తూపశీపై అయన కుమారుడు కా,, పెనుక భారత్ (విక్రమ్ కుమారుడు) జెండా ఆవిష్కరించారు. అనంతరం కా,, విక్రమ్ జీవిత సహచరి లక్ష్మక్క స్తూపం ఎదుట అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మాజీ దళ కమాండర్ ,ప్రతిఘటన పోరాట వారసుడు, ఆదివాసీ ముద్దు బిడ్డ అయిన కా,, విక్రమ్ తేదీ:15.12.2022 రోజున వరి చేను లో పాము కాటు వేయడంతో మరణించాడని,.కామ్రేడ్ విక్రమ్ ప్రజా సమస్యల పరిష్కారం కోసం,పీడిత ప్రజల హక్కుల సాధన కోసం ,ఆదివాసీ గిరిజన పేదలకు పోడు భూములు కొట్టించాడని,నిరంతరం పోరాడిన నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు కార్యకర్త అని కొనియాడారు. సారా వ్యతిరేక ఉద్యమం, జీతగాండ్ల సమ్మె,కూలీ రేట్ల పెంపు,తునికాకు రేట్ల పెంపు కోసం తదితర పోరాటాల్లో చురుకుగా పాల్గొన్నారని పేర్కొన్నారు.గ్రామీణ పేదలు,రైతులు, వ్యవసాయ కూలీలు, శ్రామిక ప్రజల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ వారి హక్కుల కోసం పోరాటాల్లో భాగస్వామిగా నిలిచారని పేర్కొన్నారు.వ్యక్తిగత ప్రయోజనాల కంటే సామాజిక మార్పుకే ప్రాధాన్యతనిస్తూ, విప్లవోద్యమ భావజాలం పట్ల అంకితభావంతో పనిచేసిన కా,, విక్రమ్ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ప్రజా ఉద్యమాల పట్ల ఆయన చూపిన నిబద్ధత, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయంగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. కామ్రేడ్ విక్రమ్ ఆశయాలను కొనసాగిస్తూ దోపిడీ, పీడన, అసమానతలు లేని సమసమాజ స్థాపన కోసం ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ (యం-యల్) న్యూడెమోక్రసీ, వివిధ ప్రజా సంఘాల నాయకులు,కార్యకర్తలు ,అభిమానులు ,ప్రజలు కా,, పందిరి జగత్ రెడ్డి కా,, జనార్దన్,నారాయణ, నరేష్, లక్ష్మన్, మల్లేశం, జగాన్నాయలగూడెం, అప్పరాజుపల్లి, దామరవంచ ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో ప్రభుత్వ సేవలందించిన పెనక సమ్మయ్య సేవలు అభినందనీయం

ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో

40 సంవత్సరాల సుదీర్ఘ సేవల అనంతరం పదవీ విరమణ ఘనంగా సత్కరించిన ఐటీడీఏ పీఓ, అధికారులు



ఏటూరునాగారం, నవంబర్ 04(జనంసాక్షి). ఐటీడీఏలో సుదీర్ఘకాలం అంకితభావంతో, నిబద్ధతతో సేవలందించిన పెనక సమ్మయ్య అక్టోబర్ 31, 2026న ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ఆయనను ఘనంగా సత్కరించి, ఆయన సేవలను అభినందించారు.పెనక సమ్మయ్య 1986 సంవత్సరంలో ఐటీడీఏలో రోజువారీ వేతన ఉద్యోగిగా ఆఫీస్ సబార్డినేట్ (ఓఎస్) హోదాలో తన సేవలను ప్రారంభించారు. అనంతరం 1993 సంవత్సరంలో ఆయన సేవలను క్రమబద్ధీకరించి శాశ్వత ఉద్యోగిగా నియమించారు. అప్పటి నుంచి పదవీ విరమణ వరకు సుమారు నాలుగు దశాబ్దాల పాటు శాఖకు సేవలందించారు. తన ప్రాథమిక హోదా ఆఫీస్ సబార్డినేట్ అయినప్పటికీ, అవసరాల మేరకు డ్రైవర్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తూ శాఖకు విశేష సేవలు అందించారు. ఈ సందర్భంగా పీఓ లెనిన్ వత్సల్ టోప్పో మాట్లాడుతూ, పెనక సమ్మయ్య సుదీర్ఘకాలం పాటు అత్యంత నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అప్పగించిన బాధ్యతలను ఎల్లప్పుడూ నిబద్ధతతో నిర్వర్తిస్తూ, శాఖ అవసరాలకు అనుగుణంగా వివిధ విధులను సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగంలో పదవులు, హోదాలకంటే విధుల పట్ల చూపే అంకితభావం, సేవా దృక్పథం ఎంతో ముఖ్యమని, సమ్మయ్య తన సుదీర్ఘ సేవా ప్రస్థానంలో దీనిని ఆచరణలో చూపించారని ప్రశంసించారు. ఎటువంటి ప్రతికూల వ్యాఖ్యలు లేకుండా ప్రశంసనీయమైన సేవా రికార్డుతో పదవీ విరమణ పొందడం ఆయన వృత్తిపరమైన నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. సంస్థలో దీర్ఘకాలం పనిచేసిన ఉద్యోగుల అనుభవం, సేవలు శాఖకు విలువైనవని, వారి కృషిని గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పీఓ తెలిపారు. పదవీ విరమణ అనంతరం సమ్మయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, సంతోషంగా ప్రశాంత జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పీఓ లెనిన్ వత్సల్ టోప్పో పెనక సమ్మయ్యను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొని ఆయనకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

మృతుని కుటుంబానికి ప్రభుత్వం 25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చల్ల నారాయణరెడ్డి



మహాదేవపూర్: నవంబర్ 4(జనంసాక్షి)నిన్న మధ్యాహ్నం బిరాసాగర్ ఇసుక క్వారీ నుండి ఇసుకలోడుతో వెళుతున్న లారీ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పోత స్వామిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మహాదేవపూర్ మండలంలో బీరాసాగర్ గ్రామ శివారులోని చోటు చేసుకోవడం జరిగిందని మంథని నియోజకవర్గంలో ఇసుక క్వారీల నుండి వచ్చే ఇసుక లారీలతో రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు.ప్రజల ప్రాణాలకు రక్షణ కరువైందని అన్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చల్లా నారాయణరెడ్డి. బుధవారం రోజు మహాదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న పోత స్వామి మృతుదేహం వద్దకుచేరుకోని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం చల్ల నారాయణరెడ్డి దహన సంస్కారాలకు ఆర్థిక సహాయాన్ని అందించారు. మంథని నియోజకవర్గంలో పాటు మహాదేవపూర్ మండల కేంద్రంలో ఇసుక లారీల ప్రమాదాలకు గురికావడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని, ఇసుక రవాణా అతివేగం భారీ వాహనాల ఇష్ట రాజ్యం మధ్య సామాన్య ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని, నియోజకవర్గ ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ పాలన ఏం చేస్తుందని ప్రశ్నించారు చల్ల నారాయణరెడ్డి, భద్రత ప్రజల ప్రాణాలను పట్టించుకోకుండా ప్రభుత్వం ఇసుక రవాణాకు ప్రాధాన్యత ఇస్తుందని, ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు, అలాగే ఇసుక లారీ ఢీకొని రుచితొందిన స్వామి కుటుంబాన్ని 25 లక్షల రూపాయల పరిహారాన్ని అందించి, మృతునికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని వారిలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని చల్ల నారాయణరెడ్డి డిమాండ్ చేశారు, ఈ పరామర్శ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు మనోజ్ తో పాటు కార్యకర్తలు ఉన్నారు.

భూ రీసర్వే ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్



కమలాపూర్ అక్టోబర్ 04 (జనం సాక్షి) :- హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూనిపర్తి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు గ్రామంలో ఎన్ని ఎకరాల భూమి రీ సర్వే చేశారని, ఇంకా ఎన్ని ఎకరాల భూమిని రీ సర్వే చేయాల్సి ఉందననే వివరాలను అధికారులు, సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూముల రీ సర్వే ను వేగవంతం చేయాలని సర్వేయర్లు, అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సురేష్ కుమార్, సర్వేయర్లు,ఇతర అధికారులతో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పుకు అందరు సహకరించాలి

మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్



స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 04 (జనం సాక్షి) : స్టేషన్ ఘన్పూర్ పట్టణకేంద్రంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం నుండి తెలంగాణ తల్లి విగ్రహం నుండి బస్టాండ్ వరకు చేపడుతున్న రోడ్డు వెడల్పు పనులకు ప్రజలందరూ సహకరించాలని స్టేషన్ ఘన్పూర్ మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ అన్నారు. బుధవారం తాసిల్దార్ కార్యాలయం నుండి రోడ్డు వెడల్పు పనులు ప్రారంభం కావడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సీసీ డబుల్ రోడ్డు పడితే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్ నెంబర్లు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీడీవో



ఖానాపూర్ రూరల్ 4 నవంబర్ (జనం సాక్షి): మండలంలోని బాబాపూర్ (ఆర్) గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న వివో భవనం, అంగన్‌వాడీ భవనం, సామూహిక ఇంకుడు గుంత నిర్మాణ పనులను ఎంపీడీవో రాధా రాథోడ్ పరిశీలించారు. అనంతరం గ్రామంలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన సేంద్రియ కూరగాయల తోటను సందర్శించారు. తోటలో పండించిన కూరగాయలను మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు అందించడం పట్ల ఉపాధ్యాయులను, సర్పంచ్‌ను అభినందించారు. విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిశుభ్ర గ్రామమే లక్ష్యంగా కంజర్‌లో చెత్తబుట్టల పంపిణీ



దిలావర్‌పూర్, నవంబర్ 04, (జనం సాక్షి): పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి, పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పాలనే ఉద్దేశంతో దిలావర్‌పూర్ మండలంలోని కంజర్ గ్రామంలో సర్పంచ్ షేరు చందు చెత్తబుట్టల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు చెత్తబుట్టలను అందజేసి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో పడవేయకుండా కేటాయించిన చెత్తబుట్టల్లోనే వేయాలని సూచించారు. పరిశుభ్రత పాటించడం ద్వారా గ్రామాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బరు కుంట గంగారం, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, వార్డు సభ్యులు రమేష్, బాసిత్, డైరెక్టర్ సాయన్న తదితరులు పాల్గొన్నారు.

లైసెన్సులు నిల్... కొనుగోళ్లు ఫుల్

మొత్తం ఆర్థికంగా చితికిపోతోంది.

తేమ పేరుతో నిలువు దోపిడీ

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతుకు అందాలంటే పత్తిని మార్కెట్ యార్డులోనే అమ్ముకోవాలి. కానీ దళారులు గ్రామాల్లోని రైతులను మోసం చేస్తూ తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. మద్దతు ధరకు, వాస్తవ ధరకు మధ్య ఉన్న తేడాను వారే సొమ్ము చేసుకుంటున్నారు. రైతుకు మద్దతు ధర గురించి సరైన అవగాహన లేకపోవడం, యార్డుకు వెళ్తే ట్రాలీ ఖర్చు, కూలీల ఖర్చుతో పాటు సమయం వృథా అవుతుందనే భయం దళారులకు కలిసి వస్తోంది. మార్కెట్ యార్డులో సరైన తూకం, నాణ్యత పరీక్ష వెంటనే చెల్లింపు వంటి సౌకర్యాలు ఉన్నా, రైతులు వాటిని వినియోగించుకోలేకపోతున్నారు. దళారులు మాత్రం రైతుల నుంచి తక్కువకు కొని, అదే పత్తిని పెద్ద వ్యాపారులకు, మిల్లులకు అధిక ధరకు అమ్ముకుంటూ లాభపడుతున్నారు. దీంతో మార్కెట్ యార్డు నిర్వీర్యమైపోతోంది. యార్డులో కొనుగోళ్లు తగ్గిపోవడంతో అక్కడ పనిచేసే కూలీలు, హమాలీలు కూడా ఉపాధి కోల్పోతున్నారు. రైతు తన పంటను యార్డుకు తీసుకువెళ్తేనే ప్రభుత్వ పథకాలు, బీమా, ఇతర ప్రయోజనాలు అందుతాయనే విషయాన్ని కూడా దళారులు రైతులకు చెప్పడం లేదు. పైగా యార్డులో ధర తక్కువ వస్తుందని, తేమ ఎక్కువ ఉందని చెప్పి తిరస్కరిస్తారని భయపెడుతున్నారు.

మార్కెట్ ఆదాయానికి గండి

వ్యాపారులు తమ వ్యాపార నిర్వహణకు తప్పనిసరిగా లైసెన్సు తీసుకోవాల్సి ఉండగా, కొందరు జాయింట్ లైసెన్సు తీసుకుని మార్కెట్ కమిటీ లైసెన్సు మాత్రం తీసుకోకుండా వ్యాపారం చేస్తున్నారు. దీని వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఒక శాతం నిధులు రాకుండా పోవడంతో ముందుగా మార్కెట్ ఆదాయానికి గండి పడుతోంది. చెక్ పోస్టులను తప్పించుకుంటూ, పత్తిని ఇతర ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి వేళల్లో, తెల్లవారుజామున వాహనాల్లో పత్తిని తరలించడం, చిన్న చిన్న వాహనాల్లో విడివిడిగా పంపడం వంటి మార్గాలను ఎంచుకుంటున్నారు. మార్కెట్ కమిటీకి రావాల్సిన రుసుము ఎగవేత వల్ల మార్కెట్ యార్డుల అభివృద్ధి, రైతులకు కల్పించాల్సిన సౌకర్యాలు దెబ్బతింటున్నాయి. ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లుతోంది. రుసుము వసూలు అయితేనే యార్డులో తాగునీరు, నీడ, గోదాము, తూకం యంత్రాల నిర్వహణ వంటివి సాధ్యమవుతాయి. కానీ రుసుము ఎగవేత వల్ల ఆ అభివృద్ధి ఆగిపోతోంది. అధికారులు చెక్ పోస్టుల వద్ద సరైన నిఘా పెట్టకపోవడం, గ్రామాల్లో తనిఖీలు చేయకపోవడం వల్లే ఈ దందా గ్రామాల్లో దర్జాగా సాగుతోందనేది స్పష్టమవుతోంది.

అధికారుల అప్రమత్తతతోనే రైతులకు న్యాయం

గ్రామాల్లో ఇంత బహిరంగంగా అక్రమ కొనుగోళ్లు జరుగుతున్నా మార్కెట్ అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారు. రైతులు ఫిర్యాదు చేసినా స్పందన లేదని, అధికారులు కార్యాలయానికే పరిమితమై, క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ అధికారులు వెంటనే మేల్కొని, ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేసి వెంకటాపూర్ మండలంలోని ప్రతి గ్రామంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. లైసెన్సు లేకుండా వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. వారి వాహనాలను సీజ్ చేయాలి. రైతులకు మార్కెట్ యార్డులోనే పత్తి అమ్ముకునేలా అవగాహన కల్పించాలి. మద్దతు ధర, తూకం, చెల్లింపు విషయంలో రైతులకు భరోసా ఇవ్వాలి. మోసపోయిన రైతులకు న్యాయం చేయాలి. లైసెన్సు లేని కొనుగోళ్లను అరికట్టకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని, ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి చర్యలు చేపట్టాలని రైతు సంఘాలు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

సంబంధించిన అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలు ఆ యాప్ లో నమోదు చేయాల్సి ఉంటుంది. మండల ప్రత్యేక అధికారి, డీఏవో వెంకట్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో యాసంగికి ఆలోచించే పంటలు వేయాలన్నారు. జిల్లాలో మూడు మండలాల్లో సగటు వర్షపాతం కంటే తక్కువ నమోదు కావడంతో కరువు మండలాలుగా ప్రకటించడం జరిగిందన్నారు. మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదయినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా పంట నష్టం జరిగినటువంటి రైతులను క్షేత్రస్థాయిలో గుర్తించి నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.త్వరలోనే మండల వ్యవసాయ విస్తరణ క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలను సేకరిస్తారని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన సిబ్బంది పై చర్యలు తీసుకుంటామన్నారు.

కరంజివాడ వ్యవసాయ విస్తరణ అధికారిని విధులపై నిర్లక్ష్యం విషయంలో కరంజివాడ సర్పంచ్ రాథోడ్ బల్వంత్ ఫిర్యాదు చేయడంతో షోకాస్ నోటీస్ ఇవ్వాలని ఏవో ను ఆదేశించారు. సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై సంబంధిత శాఖల ఉన్నత అధికారుల ద్వారా కలెక్టర్కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అంతకుముందు మండల సర్పంచ్ ఫోరం ఆధ్వర్యంలో ఎంపీడీవో గా పదవీ బాధ్యతలు చేపట్టిన సాయికుమార్ గౌడ్ ను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఆత్రం లక్ష్మణ్ రావు,పెందోర్ ఆనంద్ రావు,కావుడే తులసిరాం,కుంరం నాణేశ్వర్,జాదవ్ అమూల్, కుడ్మేత కొద్దు, బుచ్చయ్య,శారద,రోజా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సైబర్ జాగృతి దివస్ సందర్భంగా

విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన

కాసిపేట, నవంబర్ 4, (జనంసాక్షి) : సైబర్ జాగృతి దివస్ సందర్భంగా బుధవారం కాసిపేట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో కాసిపేట మోడల్ స్కూల్లో విద్యార్థులకు సైబర్ నేరాలు, సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ప్రస్తుత డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, వాటి నివారణ చర్యల గురించి వివరించారు. విద్యార్థులు ఇంటర్నెట్, సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించాలని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్లు, అనుమానాస్పద లింకులు, నకిలీ వెబ్సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరితోనూ ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్వర్డ్లు, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని, సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకునే సమయంలో జాగ్రత్త వహించాలని తెలిపారు. సైబర్ నేరాలకు గురైనట్లయితే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్లైన్ నంబర్కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్సైట్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ జాగృతి దివస్ ముఖ్య ఉద్దేశం ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించడం, ఆన్లైన్ మోసాల బారిన పడకుండా అప్రమత్తం చేయడం అని తెలిపారు. ఈకార్యక్రమంలో కాసిపేట ఎస్సై శ్రావణ్ కుమార్, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలకు 3 రోజులు సెలవులు ఇవ్వాలి

భానాపూర్ నవంబర్ 04 (జనం సాక్షి) : దీపావళి పండుగ సందర్భంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 8వ తేదీ నుండి మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకట్రావు నాయక్ ఐటీడీఏ పీవోను వినతి పత్రం అందజేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులకు దీపావళి అత్యంత పవిత్రమైన, పెద్ద పండుగ అని పేర్కొన్నారు. దండారి, గుస్సాడీ నృత్యాలు, పోరి వేషధారణలతో ఊళ్లలోని గిరిజనులంతా ఎక్కడున్నా స్వగ్రామాలకు చేరుకుని పండుగను ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులు ఆగలేక గోడలు దూకి వెళ్తున్నారని, తల్లిదండ్రులు కూడా పిల్లలను పంపాలని ప్రతిరోజూ వస్తున్నారని పీవో నీవు ఒక సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ 3 రోజుల సెలవులకు పరిహారంగా డిసెంబర్, జనవరి నెలల్లోని రెండో శనివారాలను పనిదినాలుగా నిబంధనల ప్రకారం మార్చుకోవచ్చని సూచించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

కెరమెరి,నవంబర్ 4 (జనంసాక్షి) : కెరమెరి మండలం బోరిలాల్ గూడలో టిజిబి కెరమెరి శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో గ్రామస్తులకు బ్యాంకు పొదుపు పథకాలు,రుణ సదుపాయాలు, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమ యోజన, ప్రధానమంత్రి సురక్ష యోజన వంటి బీమా పథకాలు, డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ బీమా పొందాలని అధికారులు సూచించారు. అధికారులు మాట్లాడుతూ పొదుపు చేయడం వల్ల భవిష్యత్తులో ఆర్థిక భద్రత ఉంటుందని, కేవలం రూ.436 తో 2 లక్షల జీవిత బీమా పొందవచ్చని,ప్రమాద బీమా పథకాల ద్వారా కుటుంబానికి అండగా నిలవవచ్చని వివరించారు. కార్యక్రమంలో టీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ వంశీ, సిఎఫ్ఎల్ కౌన్సిలర్ చంద్రశేఖర్, జంగు,గ్రామ సర్పంచ్ చవాన్ శంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువత లక్ష్య సాధనకు ప్రభుత్వం అండగా ఉంటుంది

శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోలీస్ ఉద్యోగాలు సాధించాలి

మంత్రి దనసరి అనసూయ సీతక్క

ములుగు ప్రతినిధి, నవంబర్ 04(జనంసాక్షి) : యువత లక్ష్య సాధనకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, పట్టుదలతో చదివి పోలీస్ ఉద్యోగాలు సాధించాలని అభ్యర్థులకు సూచించారు. బుధవారం ములుగు ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను మంత్రి పరిశీలించారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో నేరుగా మాట్లాడి, వారి చదువు, శిక్షణా విధానం, వసతి సౌకర్యాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల్లో మెరుగైన అవకాశాలు



కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అభ్యర్థులు లక్ష్యంపై దృష్టి సారించి, క్రమశిక్షణతో శిక్షణ పొందాలని సూచించారు. ఎక్కువ మంది అభ్యర్థులు ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించి, తదుపరి దశల్లోనూ ప్రతిభ కనబరిచి పోలీస్ ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. అభ్యర్థుల విజయానికి అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రి శిక్షణార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, డీఎస్పీ రవీందర్, ఆర్ఐ, సీఐ, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

కుంగిన మేడిగడ్డ ప్రాజెక్టుపై రాజకీయమెందుకు పుట్ట మధు?

ఉనికి కోసమే ప్రాజెక్టు పర్యటనలు

కాటారం సబ్ డివిజన్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు కొండ గొర్ల బాపు



మహా ముత్తారం నవంబర్ 4 (జనం సాక్షి) నిబంధనలు పక్కనపెట్టి కమిషన్ల కోసం కాలేశ్వరం ప్రాజెక్టు కట్టి వేల కోట్లు నీతో పాటు కేసీఆర్ కుటుంబం దోసుకున్నారని అందుకే నాణ్యత లేకుండా ప్రాజెక్టు కుంగి దని ఇంకా సిగ్గు లేకుండా ప్రాజెక్టు సందర్శన చేయడం మానుకోవాలని పుట్ట మధుకు మహాముత్తారం సర్పంచ్ మరియు కాటారం సబ్ డివిజన్ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కొండ గొర్ల బాపు హితవు పలికారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇసుక క్వారీలు ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదని ఆ పాలసీ తీసుకొచ్చింది నీవు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మీ మీ దోపిడి ప్రభుత్వం అడ్డగోలుగా ఈ ప్రాంతంలో క్వారీలు ఏర్పాటు చేసి వేల కోట్లు దోసుకున్నారని అందులో నీ కుటుంబం ప్రధాన భాగస్వామ్యం అని నీవు 900 కోట్లు దోచుకున్నది నిజం కాదా ఇంకా నీకు బుద్ధి జ్ఞానం లేకుండా ఇసుక క్వారీలపై మాట్లాడడం మీ అవివేకానికి నిదర్శనమని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు ఈ ప్రాంత ప్రజలకు నీతి నిజాయితీతో సేవ చేస్తాడని నీలాగా దోపిడీకి హత్యలు చేయడని అందుకే ఈ ప్రాంత ప్రజలు దుద్దిల్ల శ్రీధర్ బాబు ని భారీ మెజార్టీతో గెలిపిస్తున్నారని నీలాంటి అవినీతిపరుడికి ఈ ప్రాంత ప్రజలు ప్రతి ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతున్న నీ ప్రవర్తనలో మార్పు రావడం లేదని, కేవలం నీ ఉనికి చాటుకోవడానికి మాజీ ఎమ్మెల్యేలతో ప్రాజెక్టుల పర్యటనలు చేస్తున్న తప్ప మీతో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని అన్నారు. టిఆర్ఎస్ అవినీతి ప్రభుత్వ హయాంలో చిన్న కాలేశ్వరం ప్రాజెక్టు కట్టకుండా అడ్డుకొని ఈ ప్రాంత ప్రజలకు సాగునీరందకుండా చేశావు. మేడిగడ్డ ప్రాజెక్టు మీ కెసిఆర్ ఫామ్ హౌస్ కోసమే నిర్ణయించుకున్నారని అన్నారు. మంథని నియోజకవర్గంలోని ఒక్క ఎకరానికైనా నీవు నీ రియాలని కేసీఆర్ను అడగకుండా కమిషన్ల కోసం మౌనంగా ఉండి ఈ ప్రాంత రైతులకు తీవ్ర అన్యాయం చేశావు ఏం మొఖం పెట్టుకొని కాలేశ్వరం ప్రాజెక్టు వద్దకు వెళ్లి నీళ్లన్నీ వృధాగా పోతున్నాయి నీళ్లు ఇవ్వడం లేదని ఎందుకు మొత్తుకుంటున్నావు నీవు, నిజంగా ప్రజలకు సేవ చేసే నాయకుడివి అయితే ముందు మంథని ప్రాంతానికి అప్పటి ప్రభుత్వంలో నీళ్లు ఇవ్వాలి నీళ్లు ఇవ్వకుండా ఇతర జిల్లాలకు పంపించి ఈ ప్రాంత రైతన్నలను మోసం చేశావని అన్నారు. అందుకే గత ఎన్నికల్లో నీకు తగిన బుద్ధి చెప్పారు. మేడిగడ్డ వద్ద నీటిని ఆపితే అది మొత్తానికి కొట్టుకపోతుందని కేంద్ర ప్రభుత్వం నివేదిక ఇచ్చింది అయినా నీ ఉనికి కోసమే ఇది చేస్తున్నావు. మంత్రి శ్రీధర్ బాబు పై కానీ శీను బాబు పై గాని అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని నీకు ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. ఇప్పటికైనా నీ ఆరోపణలు మార్చుకోవాలని హెచ్చరించారు.